రామయ్యను దర్శించుకున్న ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్

స్వర్ణభద్ర కవచాలతో దర్శనమిచ్చిన సీతారాములు

భద్రాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ ప్రభాత్‌కుమార్ గుప్తా శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాన్ని అందజేశారు. అలాగే రామాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్రస్వామి వారు స్వర్ణకవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం 1 నవంబరు 2025

గోడలే.. ఖమ్మానికి రక్షణ



ఖమ్మం మున్నేరు ప్రవాహం (ఏరియల్ వ్యూ)



మున్నేరుకు ఇరువైపులా నిర్మిస్తున్న రక్షణ గోడలు

ఖమ్మం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎగువన వర్షం కురిసినా.. తుఫాన్‌తో వర్షాలు, వరదలు వచ్చినా.. ఖమ్మం నగరానికి మున్నేరుతో పెద్ద ముప్పే ఎదురవుతోంది. ప్రతి ఏటా మున్నేరు పొంగుతుందంటే ఇటు ఖమ్మం నగరం.. అటు ఖమ్మం రూరల్ మండలంలోని పరివాహక కాలనీల ప్రజలు భయంతో భీతిల్లుతున్నారు. అకాల వర్షాల వరద మున్నేరుపై పడి పరివాహక కాలనీల ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోంది. ప్రతి ఏటా వస్తున్న మున్నేరు వరదలతో ముంపు బాధితుల్లో ప్రతి ఒక్కరికీ కనీసం రూ.50వేల నుంచి 5లక్షల వరకు ఆస్తి నష్టం జరుగుతోంది. కార్లు, ద్విచక్ర వాహనాలు, టీవీలు, ఫ్రిజ్‌లతోపాటు విలువైన దుస్తులు, పరుపులు, నిత్యావసరాలు సైతం నీటిపాలవుతున్నాయి. ఇళ్లూ బురదపాలవుతున్నాయి. వరద వచ్చిన తర్వాత కుటుంబసభ్యులతో బయటకు వెళ్లడం, వరద తగ్గిన తర్వాత ఇళ్లు శుభ్రం చేసుకుని తిరిగి ఇళ్లకు వెళ్లడం వరద బాధితులకు పెద్ద సమస్యగా మారింది. ఓవైపు వరద, మరోవైపు బురద, ఇంకోవైపు వర్షం తోడైతే.. వరద బాధితుల దుస్థితి వర్ణనాతీతం. పునరావాస కేంద్రాలకు వెళ్లడం.. అక్కడ పెట్టింది తినడం.. అక్కడే నిద్రపోవడం కష్టతరంగా మారింది. వేలసంఖ్యలో వరద బాధితులు వరదతో పునరావాస కేంద్రాలకు వస్తే అక్క కూడా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం కూడా ప్రతి యేడు బాధిత కుటుంబాలకు నష్టపరిహారాలు, ఇతర సౌకర్యాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. మున్నేరు 20అడుగులు దాటితే నగరంలోని శివారు కాలనీలు బొక్కలగడ్డ, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, ధంసలాపురం, మోతినగర్, నాయుడుపేట, జలగంనగర్, కరుణగిరి, రాజీవ్‌గృహకల్ప, పెద్దతండా, దానవాయిగూడెం తదితర కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయి. గతేడాది 36 అడుగుల దాటడడంతో మున్నేరు వరద బీభత్సం సృష్టించి.. అనేక కుటుంబాలను కన్నీటిపాలు చేసింది.

నిర్మాణం పూర్తయితేనే..

ఖమ్మంనగరంలో మున్నేరు వరద నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది మున్నేరుకు ఇరువైపులా కాంక్రీట్ వాల్స్‌తో రక్షణ గోడల నిర్మాణం చేపట్టింది. 2026 మార్చినాటికి ఈకట్టలు పూర్తి కావాల్సి ఉంది. రూ.501కోట్లతో17 కి.మీ పొడవున రెండువైపులా రక్షణ గోడలను (మిగతా 8వ పేజీలో)

శాంతించిన మున్నేరు

- తెల్లారే వరకు 19 అడుగులకు..
- వెంటనే పారిశుధ్య, విద్యుత్ పునరుద్ధరణ పనులు
- ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మేయర్
- నివాసాల వద్దకే అల్పాహారం పంపిణీతో ప్రజల హర్షం



పారిశుధ్య పనులు చేస్తున్న కేఎంసీ సిబ్బంది

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులపాటు అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలను హడలెత్తించిన మున్నేరు వరద ఎట్టకేలకు శాంతించింది. గత బుధ, గురువారాల్లో మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలు.. మున్నేరు వరద ఉధృతికి నివాసాల్లోకి నీరు రావడంతో.. ఖమ్మం నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లారు. అయితే కొన్ని గంటల సమయంలోనే 8.5 అడుగుల నుంచి రికార్డు స్థాయిలో 26 అడుగులకు చేరడంతోపాటు ఐదు గంటల పాటు వరద తీవ్రత తగ్గక పోవడంతో.. వరద పోటు కాల్వొడ్డు, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, మోతీనగర్ ప్రాంతాలపై పడింది. గురువారం రాత్రి 11 గంటల తర్వాత వరద తగ్గుముఖం పట్టడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం తెల్లారేవరకు ఏకంగా 19 అడుగులకు చేరింది. దీంతో మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజలు గంగమ్మకు పూజలు చేశారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు నమోదు కాకపోవడం, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించిన తీరుతో ఖమ్మం నగర పాలక సంస్థ అధికార యంత్రాంగం పనితీరు మరోసారి భేష్ అనిపించుకుంది.

యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు

మున్నేరు వరద ఉధృతి తగ్గడంతో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ సూచనల మేరకు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో డీఆర్‌ఎఫ్ ఇన్‌చార్జ్ బెల్లం రాధిక యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టారు. ఉదయం 6గంటల నుంచి మున్నేరు ముంపు ప్రభావిత ప్రాంతాలైన పద్మావతినగర్, మోతీనగర్, వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ, కాల్వొడ్డులో (మిగతా 8వ పేజీలో)

రూ.10వేల పరిహారం సరిపోతుందా?

- రైతుల జీవితాలను గాలికొదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రాజకీయ లాభం కోసమే ప్రభుత్వ పెద్దల పర్యటనలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు



వరద బాధితులతో మాట్లాడుతున్న దృశ్యం

ఖమ్మం బైపాస్ రోడ్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేల పరిహారం ఏమాత్రం సరిపోతుంది? అని.. ఇది రైతును అవమానపరచడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు అన్నారు. శుక్రవారం రాత్రి ఖమ్మం నగరంలో పర్యటించిన ఆయన.. మున్నేరు పరివాహకంలోని వరద బాధితులను కలిసి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామచంద్రరావు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ పట్టాలు లేకపోవడంతో వర్షంతో తడిచిపోయిన ధాన్యాన్ని పడేయాల్సిన పరిస్థితి రైతులకు ఎదురైందన్నారు. రైతుల పంటను రక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.. కొనుగోలు కేంద్రాల్లో కనీస సదుపాయాలు కూడా లేకపోవడం రైతు ఆత్మాభిమానానికి అవమానం అని అన్నారు. ప్రభుత్వం రైతుల జీవితాలను గాలికి వదిలేసి ఓట్ల కోసం పాకులాట ఆపాలని ఆయన హెచ్చరించారు. మున్నేరు పరివాహక ప్రాంతాల్లో ఇళ్లు మునిగిపోవడంతో దోమలు, వాసనలతో ఆరోగ్య సమస్యలు తీవ్రమైనప్పటికీ.. హెల్త్ డిపార్టుమెంట్ అధికారులకు కనీసం కంటికి కనపడడం లేదన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చింతలేదని ఆయన మండిపడ్డారు. సుందరీకరణ పేరుతో పార్కులు, రిటైనింగ్ వాల్ పనులు చేసి చూపు మాయ చేస్తున్నారన్నారు. వరద నీరు బయటకు వెళ్లే మార్గాలు లేకపోవడంతో నష్టం అధికమైందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉందని, ప్రజలు ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయన్నారు. అయినా ప్రభుత్వ పెద్దలు రాజకీయ లాభం కోసమే పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు కేసులుపెట్టి భారతీయ జనతాపార్టీ కార్యకర్తలను వేధిస్తున్నారని, అధికార పార్టీ నేతల ఒత్తిడితో విచారణలు జరుగుతున్నాయని రామచంద్రరావు మండిపడ్డారు. అంతకుముందు ఎన్. రామచంద్రరావు.. నగరంలోనిమోతీనగర్‌లో వరద బాధితులతో మాట్లాడారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నాయుడు రాఘవరావు, ఎన్.ప్రవీణ్‌కుమార్, నాయకులు ఎం.సుబ్బారావు, డి.మల్లేశ్వరి, కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాటు వేసి.. కత్తితో పొడిచి

- సీపీఎం రాష్ట్ర నేత సామినేని రామారావు దారుణ హత్య
- అత్యంత కిరాతకంగా చంపిన దుండగుడు
- పాతర్లపాడు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు
- హత్యను ఖండించిన పలు రాజకీయ పార్టీలు



సామినేని రామారావు (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కూతురు

చింతకాని, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు, రైతు సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామినేని రామారావు(75) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యారు. సీపీఎం పార్టీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు ఉన్న రామారావు హత్య జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. శుక్రవారం ఉదయం స్వగ్రామమైన పాతర్లపాడులో ఉదయపు నడక అనంతరం ఇంటికి వచ్చిన రామారావు.. ఇంటి పక్కనే ఉన్న కొట్టంలో తట్ట కింద కప్పెట్టిన కోళ్లను విడిచేందుకు వెళ్లాడు. అప్పటికే అక్కడే డాబా మీద మాటు వేసి ఉన్న దుండగుడు.. ఒక్కసారిగా వచ్చి పొడవైన కత్తితో రామారావు పొట్ట, ఛాతి భాగంలో పొడిచాడు. నొప్పితో రామారావు కేకలు వేయడంతో భార్య స్వరాజ్యం, పక్కింటి వారి వచ్చి చూడగా.. అప్పటికే రామారావు రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించారు. కత్తితో పొడిచిన అనంతరం దుండగుడు రామారావు ఇంటి వెనుక ఉన్న పెరడు నుంచి పరారయ్యాడు. కత్తి పోట్లతో తీవ్ర రక్తస్రావం కావడంతో రామారావు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. రామారావుకు, దుండగుడికి మధ్య జరిగిన పెనుగులాటలో దుండగుడు ధరించిన ఎరుపు, నలుపుతో ఉన్న టీషర్టులో ఓ ముక్కతో పాటు దుండగుడు వాడిన కత్తి తాలూకా పౌచ్ సంఘటన స్థలంలో పడిపోయాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హత్యకు గురైన రామారావు నివాసానికి చేరారు. విషయం తెలుసుకున్న సీపీ సునీల్‌దత్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఘటనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందం ఘటనా ప్రాంతంలో వేలిముద్రలు, రక్తనమూనాలతో పాటు కొన్ని ఆధారాలను సేకరించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది దుండగుడి ఆచూకీ కోసం గాలించడంతో గ్రామంలోని పల్లె (మిగతా 6వ పేజీలో)

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

- 20 అడుగులు దాటిన ప్రవాహం
- 25 అడుగుల వరకు చేరుకునే అవకాశం



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

భద్రాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):గత రెండు రోజులుగా గోదావరి ఎగువన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. 15 అడుగుల వద్ద ఉన్న గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 20 అడుగులు దాటి ప్రవహిస్తోంది. గోదావరి ఎగువన ఉన్న మేడిగడ్డ వద్దకు నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు చేరడంతో దిగువకు వదులుతున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 25అడుగుల వరకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సమైక్యతా భావంపై అవగాహన కల్పించడమే లక్ష్యం

సీపీ సునీల్ దత్



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో జాతీయ ఐక్యత, సామరస్యం, దేశభక్తి, సమైక్యతా భావం పట్ల అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని పోలీసు కమిషనర్ సునీల్ దత్ అన్నారు. భారత ఐక్యతా స్ఫూర్తికి ప్రతీక అయిన సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం పరుగు రన్ ఫర్ యూనిటీని శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముందుగా జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీపీ పరుగు కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. లకారం ట్యాంక్ బండ్ నుంచి కేఎంసీ స్పోర్ట్స్ గ్రౌండ్ వరకు పరుగు సాగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సర్దార్ పటేల్ సేవలు, దేశాన్ని ఏకాత్మబంధంతో కట్టిపడేసిన ఆయన నాయకత్వం ప్రతీ ఒక్కరికి ప్రేరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీలు ప్రసాదరావు, రామానుజం, కుమారస్వామి, విజయ్‌బాబు, ఏసీపీలు రమణమూర్తి, సుశీల్‌సింగ్, నరసయ్య, డాక్టర్‌కూరపాటి ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి నూతన ఏరియాగా సత్తుపల్లి

సత్తుపల్లి ఏరియా జీఎంగా శ్రీనివాస్
ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి కార్పొరేట్ కార్యాలయం



నిర్మాణంలో ఉన్న జీఎం కార్యాలయం

సత్తుపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో సత్తుపల్లి కేంద్రంగా కొత్త ఏరియాను ఏర్పాటు చేస్తూ సంస్థ కార్పొరేట్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. సత్తుపల్లి మండలంలోని బొగ్గుగనులు ఇప్పటి వరకూ కొత్తగూడెం ఏరియా పరిధిలో ఉన్నాయి. సత్తుపల్లిలో 2005లో ఓపెన్ కాస్టు బొగ్గు గనులు ప్రారంభమయ్యాయి. గతంలో జేవీఆర్ ఓసీ-1తో ప్రారంభమైన బొగ్గు గనులు విస్తరించాయి. జేవీఆర్ ఓసీ-1 మూతపడగా ప్రస్తుతం జేవీఆర్ ఓసీ-2, కిష్టారం ఓపెన్ కాస్టు బొగ్గు గనులున్నాయి. ఈ గనుల నుంచి పెద్ద మొత్తంలో బొగ్గు వెలికి తీస్తున్నారు. సింగరేణి సంస్థ పరిధిలో ప్రస్తుతం సత్తుపల్లిలోని గనుల నుంచే అధిక మొత్తంలో బొగ్గు ఉత్పత్తి అవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోఓ జేవీఆర్ ఓసీ-2 నుంచి 116లక్షల టన్నుల బొగ్గు, కిష్టారం ఓసీ నుంచి 28లక్షల టన్నులు మొత్తం 144లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో సత్తుపల్లి ఏరియాను ప్రారంభించాలని మూడేళ్ల క్రితమే నిర్ణయించారు. అప్పట్లోనే సత్తుపల్లిలో జనరల్ మేనేజర్ కార్యాలయ భవనాన్ని మంజూరే చేయగా భవన నిర్మాణానికి 2022 అక్టోబర్‌లో శంకుస్థాపన చేయగా పనులు పూర్తి కావొచ్చాయి. సత్తుపల్లి నుంచి కొత్తగూడెం ఏరియా కార్యాలయం 65 కిలోమీటర్ల దూరం ఉండటంతో పాటు ఇక్కడ పెద్ద మొత్తంలో బొగ్గు ఉత్పత్తి జరుగుతూండటంతో ఇక్కడ ఏరియా కార్యాలయం ఏర్పాటు చేయాలని సంస్థ నిర్ణయించింది. ప్రస్తుత సీ అండ్ ఎండీ బలరాం చొరవతో సత్తుపల్లి ఏరియా ఆవిర్భవించబోతోతోంది. సింగరేణి సత్తుపల్లి ఏరియా ఆవిర్భావంతో పాటు జనరల్ మేనేజర్ నియామకంతో ఇక్కడ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు మొత్తం 1500 మందికి సౌకర్యంగా ఉండబోతోంది. మరో 2500 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. సత్తుపల్లి నుంచే జీఎం పాలన అందుబాటులోకి రానుండటంతో స్థానికంగా భూ సేకరణ, లారీ యజమానుల సమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెం వెళ్లాల్సిన అవసరం ఇక ముందు ఉండదు. జీఎం నూతన కార్యాలయ భవనం త్వరలో పూర్తి కానుండటంతో కొత్త భవనం నుంచే జీఎం పాలన సాగనుంది. జీఎంతో పాటు సహాయ సిబ్బంది, ఎస్‌వో టూ జీఎం, ఎస్‌వో టూ ఏరియా ఇంజనీర్, ఏరియా సెక్యూరిటీ అధికారి, ఏరియా క్వాలిటీ మేనేజర్‌లు వెంటనే అందుబాటులోకి రానున్నారు. రక్షణ, పర్సనల్, ఎస్టేట్, ఫైనాన్స్ సర్వే డిపార్ట్‌మెంట్లకు సంబంధించి కొంత కాలం కొత్తగూడెం నుంచే కార్యకలాపాలు జరగనున్నట్లు తెలిసింది. కొద్ది నెలల్లో ఆయా విభాగాలు కూడా సత్తుపల్లి ఏరియాకు రానున్నాయి. ఇప్పటికే సింగరేణి బొగ్గు తవ్వకాల్లో భాగంగా ఓవర్ బర్డెన్ మట్టిలో క్రిటికల్ మినరల్స్ ఉన్నాయనే సమాచారంతో వీటిపై పరిశోధన జరుగుతోంది. భువనేశ్వర్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్ టెక్నాలజీ. హైదరాబాద్‌కు చెందిన నాన్ సర్వెస్ మినరల్ టెక్నాలజీ డెవలప్‌మెంట్‌లతో కలసి మినరల్స్‌ను నిర్ధారించే పనిలో ఉన్నారు. ప్రాసోడియం, నియోడయోమియం, స్ట్రాన్షియం, స్కానియం లాంటి మినరల్స్ ఉన్నట్లు సమాచారంతో పరీక్షలు జరుగుతున్నాయి. ఇది నిర్ధారణ జరిగితే సత్తుపల్లి ఏరియాకు మరింత ప్రాధాన్యత దక్కనుంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని సింగరేణి సంస్థ పరిధిలో 12వ ఏరియాగా సత్తుపల్లిని ప్రకటించారు. ఇప్పటి వరకూ కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, ఆర్‌జీ-1, ఆర్‌జీ-2, ఆర్‌జీ-3, ఏఎల్‌పీ (అడ్రియాలా లాంగ్‌వాల్ ప్రాజెక్టు), భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలు ఉన్నాయి.

నూతన జీఎంగా శ్రీనివాస్

కొత్తగా ఏర్పాటు చేస్తున్న సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా చింతల శ్రీనివాస్‌ను సంస్థ ప్రధాన కార్యాలయం నియమించినట్లు తెలిసింది. శ్రీనివాస్ ప్రస్తుతం కార్పొరేట్ కార్యాలయంలో రక్షణ జీఎంగా పని చేస్తున్నారు. కొత్త జీఎం త్వరలో సత్తుపల్లిలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పట్టపగలే ద్విచక్రవాహనం చోరీ



ద్విచక్ర వాహనాన్ని తీసుకెళుతున్న దృశ్యం

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఉంచిన ద్విచక్ర వాహనాన్ని పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారు. చోరీచేసిన వాహనాన్ని తీసుకెళుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. వివరాల్లోకి వెళితే మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కాసగాని ప్రసాద్ అనే వ్యక్తి తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని ఉంచి ఇంట్లో పడుకున్నాడు. ఉదయం పదకొండున్నర సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి తీసుకెళ్లాడు. కొంత సేపటి తరువాత ప్రసాద్ లేచి చూడగా బండి కనిపించలేదు. అనంతరం సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి బండిని చోరిచేసినట్లుగా ఉంది. ఘటనపై పోలీసులకు సమాచారం అందించినట్లు బాధితుడు తెలిపాడు.

ఫంక్షన్‌కు వెళ్తే..

జూలూరుపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం చోరీకి గురికావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా.. గుండెపుడి గ్రామానికి చెందిన బాదావత్ విక్రమ్ అనే యువకుడు గురువారం రాత్రి గుండెపుడిలోని యల్లంకి గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు ఓ శుభకార్యానికి పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేసి లోపలికి వెళ్లి వచ్చాడు. ఇంటికి వెళ్లేందుకు బయటకు రాగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో తన బైక్ చోరీకి గురైందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌పై దాడికి ప్రయత్నించిన ఘటనలో 14 మందిపై కేసు

జూలూరుపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయటానికి ప్రయత్నించిన సంఘటనలో 14మందిపై కేసు నమోదు చేసినట్లు జూలూరుపాడు ఎస్సై బాదావత్ రవి తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అన్నారుపాడు గ్రామానికి చెందిన ఓ యువతి జూలూరుపాడు న్యూకాలనీకి చెందిన యువకుడు గతకొంత కాలంగా ప్రేమించుకున్నారు. ఇద్దరు మేజర్లు కావడంతో ప్రేమ వివాహం చేసుకున్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరుతూ నవదంపతులు గురువారం రాత్రి జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. వారిద్దరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్నారన్న విషయాన్ని తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు, అన్నారుపాడు గ్రామానికి చెందిన గ్రామస్తులు, వారి బంధువులను సుమారు 100 మందిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తమ కుమార్తెను తమకు అప్పగించాలని లేకపోతే గొడవ చేస్తామని చెప్పారు. ఇరువర్గాల వారిని కూర్చొబెట్టి కౌన్సిలింగ్ చేసి సదరు యువతి అభిప్రాయాన్ని అందరి సమక్షంలో తెలుసుకోనగా తాను మేజర్‌నేనని ప్రేమించిన వ్యక్తితోనే జీవిస్తానని చెప్పింది. ఈ మాటలు విన్న యువతి తల్లిదండ్రులు, వారి బంధువులు, గ్రామస్తులు ఆవేశపడి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఫర్నిచర్‌ను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఈ సంఘటనలకు పాల్పడిన వారిని వీడియో ఆధారంగా గుర్తించి 14మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

దుమ్ముగూడెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పైడిగూడెం ముందుగుంపుకు చెందిన కణితి సమ్మయ్య గడ్డిల్లు శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. కుటుంబ సభ్యులంతా పొలం పనులకు వెళ్లిన సమయంలో ప్రమాదం చోటుచేసుకోవడంతో ఇంట్లోని నగదు, సామాగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణమని బాధితులు తెలిపారు. సుమారు రూ2లక్షల ఆస్థినష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థుల నిరసన

సమస్యలు పునరావృతం కావద్దని సిబ్బందిని ఆదేశించిన ఎమ్మెల్యే జారె



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

ములకలపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అం దించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ పాఠశాలలో కనీస సౌకర్యాలు అయిన విద్యుత్, నీరు లేకపోవడంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో శుక్రవారం నిరసనకు దిగారు. మండలంలోని మూ కమామిడి గ్రామంలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూల్‌కు రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, నీటిసరఫరా పూర్తిగా స్తంభించిందని విద్యార్థులు వాపోయారు. కాగా విద్యార్థుల నిరసనను పాఠశాల సిబ్బంది అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాఠశాలకు వచ్చి విద్యార్థులతో మాట్లాడి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని, పాఠశాలలో మళ్లీ సమస్య రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిని ఆదేశించారు.

హత్య కేసులో నిందితుడికి జీవితకాల జైలుశిక్ష

తల్లాడ, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మంలంలోనిగోపాలపేట గ్రామంలో కన్నతల్లి, ఇద్దరు కుమార్తెలను చంపిన నిదితుడికి జీవికాలం జైలుశిక్ష రూ.10వేల జరిమాన విధిస్తూ శుక్రవారం సత్తుపల్లి ఏడీజేకోర్టు విధించింది. 2024 మే 17న రాత్రి గోపాల పేటలో కన్నతల్లి పిట్టల పిచ్చమ్మ, ఇద్దరు కుమార్తెలు పిట్టల నీరజ, ఝాన్సీలను ట్రాక్టర్ డ్రైవర్ పిట్టల వెంకటేశ్వర్లు కిరాతకంగా హత్య చేశాడు. అప్పట్లో సంచలనం సృష్టించిన కేసును నమోదుచేసి వైరా సీఐ ఎన్.సాగర్ తల్లాడ ఏఎస్ఐ జేవీయర్ విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈమేరకు ప్రస్తుత ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ కోర్టుకానిస్టేబుల్ బి.హరిబాబు సాక్షదా రాలను కోర్టులో సమర్పించడంతో నిందితుడు పిట్టల వెంకటేశ్వర్లుకు జీవితకాలం జైలువిక్ష రూ.10వేలు జరిమాన విధిస్తూ కోర్టుశిక్ష ఖరారు చేయడంజరిగింది.

పాఠశాలల్లో పరిశుభ్రత తప్పనిసరిగా చేపట్టాలి

భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మీ



భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారిని నాగలక్ష్మీ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పరిశుభ్రత, పచ్చదనం, భద్రత చర్యలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మీ తెలిపారు. ప్రతీ పాఠశాలలో స్పెషల్ క్యాంపెయిన్ 5.0 సేఫ్ అండ్ క్లీన్ స్కూల్ అక్టోబరు 31 వ తేదీ నుంచి నవంబర్ 25వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, ఆ కమిటీల ద్వారా పరిశుభ్రత, భద్రత, పచ్చదనం, చెత్త నిర్వహణ వంటి అంశాలను పర్యవేక్షించి రోజువారీ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. ప్రతీ పాఠశాల ప్రాంగణం, తరగతి గదుల్లో పరిశుభ్రత, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, పరిశుభ్రత - పచ్చదనం కార్యక్రమాలు అయిన మొక్కలు నాటడం, వాటిని సంరక్షణ, తదితర బాధ్యతలు నిర్వహించాల్సిందిగా కోరారు. చెత్త వేరు చేయడం, గోడలు బోర్డులు బెంచ్‌లు మొదలైన వాటి సదుపాయాలు , వాటిని మరమ్మత్తులు చేసి అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఎమర్జెన్సీ ఎగ్జిట్ సూచనలను, ప్రదర్శన కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్, పోస్టర్ పోటీలు మొదలైన వాటిని నిర్వహించాలని సూచించారు. ప్రతీ పాఠశాల తమ కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, నివేదికలు సిద్ధం చేసి తమ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. అక్టోబరు 31వ తేదీ నుంచి నవంబర్ 25వ తేదీ వరకు రోజువారీ వివరాల ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాల్సిందిగా డీఈఓ ఆదేశించారు. పై కార్యక్రమాలు నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు.

కుక్కను తప్పించబోయి కారు ప్రమాదం

ఒకరు మృతి

దమ్మపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రహదారికి ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి కారు చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదం పట్టువారి గూడెం గ్రామ శివారులో జరగగా ఓ వ్యక్తి మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తుపల్లి పట్టణానికి చెందిన వెలుగోటి భాస్కరరావు అను రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి తన కుమారుడు లక్ష్మణ్ కుమార్, సత్తుపల్లికి చెందిన రవికాంత్, కృష్ణలతో కలిసి పాల్వంచలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. కారును లక్ష్మణ్ కుమార్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో పట్వారి గూడెం శివారులో ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భాస్కర్‌రావు తలకు తీవ్ర గాయలు అయ్యాయి. మిగిలిన ముగ్గురికి కూడా గాయాలు అవడంతో వీరిని అంబులెన్స్‌లో సత్తుపల్లి తరలిస్తుండగా పట్వారీ గూడెం ఊరు దాటే లోపు గానే భాస్కరరావు మృతి చెందాడు. మిగిలిన ముగ్గురిని సత్తుపల్లికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి భార్య లక్ష్మీ జ్ఞానేశ్వరి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని అదనపు ఎస్ఐ రాఘవ తెలిపారు.

కాంగ్రెస్‌కు హత్యా రాజకీయాలు అవసరం లేదు

- గోకినేపల్లి, తెల్దారుపల్లిలోనే హత్యా రాజకీయాలు
- సర్పంచి పదవి కోసం హత్యలు చేయించే విధానం మాదికాదు
- జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, మాజీ ఎమ్మెల్సీ పోట్ల



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంసంక్షేమ విభాగం, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): గాంధేయవాదాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసే కాంగ్రెస్ పార్టీ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోసం హత్యా రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని.. తెల్దారుపల్లి, గోకినేపల్లికి వెళ్తే హత్యా రాజకీయాల పార్టీల చరిత్ర తెలుస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ధ్వజమెత్తారు. చింతకాని మండలం పాతర్లపాడులో జరిగిన హత్య విషయమై మృతుడి భార్య, కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నాయకులతో మంచిగానే ఉన్నారన్నారు. కానీ ఖమ్మం నుంచి సీపీఎం నాయకులు వెళ్లిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి హత్య బురద చల్లేందుకు నాయకులు విమర్శలు చేశారని ఆరోపించారు.జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దుర్గాప్రసాద్ మాట్లాడారు. 25ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ ఎమ్మెల్సీ నుంచి ఉప ముఖ్యమంత్రి వరకు ఎదిగిన భట్టి విక్రమార్క హత్యలు చేయించలేదన్నారు. అలాంటి వాటిని ఎప్పుడూ ప్రోత్సహించలేదన్నారు. పాతర్లపాడులో అసెంబ్లీ ఎన్నికల్లో భట్టి విక్రమార్కకు 250ఓట్లు మెజార్టీ వచ్చిందన్నారు. బాధ్యత కలిగిన రాజకీయాలు చేయాలని రాజకీయ పార్టీలపై ఇలాంటి హత్యా రాజకీయాలు ఆరోపణలు చేసే సమయంలో కనీస పోలీసు సమాచారం తీసుకోవాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గతంలో హింస ద్వారా పార్టీలను నడిపిన వారు ఉన్నారని పరోక్షంగా ఆరోపించారు. ఉన్నత స్థాయిలో ఉన్న బట్టి విక్రమార్కపై ఇటు వంటి వ్యాఖ్యలు సరైంది కాదన్నారు. కాంగ్రెస్ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, మెక్కా శేఖర్‌గౌడ్, హుస్సేన్, పుచ్చకాయల వీరభద్రం పాల్గొన్నారు.

కాంగ్రెస్ హత్యా రాజకీయాలను మానుకోవాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని

చింతకాని, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి):సామినేని రామారావు హత్య ముమ్మాటికీ కాంగ్రెస్ హత్యేనని సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీపీఎం పార్టీ విజయం సాధిస్తుందని భయంతో కాంగ్రెస్ నాయకులే ఈ హత్యకు పాల్పడ్డారన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ హత్యా రాజకీయాలకు ఆజ్యం పోస్తుందని, నియోజకవర్గంలో గుండాగిరీ, పెత్తందారీ తనం పెచ్చుమీరుతుందన్నారు. హత్యా రాజకీయాలను ప్రొత్సహిస్తున్న నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి దోషులను వెంటనే పట్టుకోవాలన్నారు.

పోతినేని నిజం తెలుసుకుని మాట్లాడాలి

చింతకాని కాంగ్రెస్ మండల కమిటీ

చింతకాని ,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ నిజం తెలుసుకుని మాట్లాడాలని హత్యా రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ దూరమని మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. సామినేని రామారావు హత్య అత్యంత దురదృష్టకరమని విచారణ వ్యక్తం చేశారు. హత్య చేసిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. కాంగ్రెస్ పార్టీకి హత్యా రాజకీయాలు తెలియదని, ప్రజలు, నియోజకవర్గ అభివృద్ధే తెలుసునన్నారు. సీపీఎం ఉనికి కోసమే రామారావు హత్యను కాంగ్రెస్ పార్టీకు ఆపాదించాలని చూస్తుందన్నారు. నిజాలు బయటకు వచ్చిన రోజు పోతినేని సుదర్శన్ చేసిన ఆరోపణలను ఎలా సరిదిద్దుకుంటారో మండల ప్రజలు చూస్తారన్నారు. హత్యను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖండించారని, నిందితులను వెంటనే పట్టుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు.

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మంప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కాంట్రాక్ట్/గౌరవ వేతనం పద్ధతిలో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 12 ప్రొఫెసర్, 26 అసోసియేట్ ప్రొఫెసర్, 8 అసిస్టెంట్ ప్రొఫెసర్, 36 సీనియర్ రెసిడెంట్, 2 ఐసీయూ స్పెషలిస్టు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 4 నుంచి 13 లోపు దరఖాస్తులు అందించాలని కోరారు. నవంబరు 15న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాటు వేసి.. కత్తితో పొడిచి

(5వ పేజీ తరువాయి)





నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, దుండగుడు వాడిన కత్తి పౌచ్

ప్రకృతి వనంలోకి వెళ్లి జాగిలం ఆగింది. మృతుడి ఒంటిపై ఏడు కత్తిగాట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా.. రామారావుది ముమ్మాటికీ కాంగ్రెస్ హత్యే అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పోతినేనిసుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. తన భర్త హత్యకు గ్రామానికి సంబంధించిన ఐదుగురు కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందంటూ ఘటనపై మృతుడి భార్య స్వరాజ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా.. హత్యకు సంబంధించి ప్రాథమిక వివరాలను సేకరించిన అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. భారీ బందోబస్తు మధ్య కుటుంబ సభ్యులు సామినేని రామారావు అంతిమయాత్ర నిర్వహించారు. రాజకీయాలకు గత కొంత కాలంగా దూరంగా ఉంటున్న రామారావు హత్య రాజకీయ కోణంలో జరిగిందా లేక ఆర్థిక లావాదేవీల విషయంలోనా!? అని పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రామారావు హత్య నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● రెండు దఫాలు సర్పంచ్‌గా..

సామినేని రామారావు 50 ఏళ్లుగా సీపీఎం పార్టీలో కొనసాగుతున్నారు. చిన్నప్పటి నుంచే సీపీఎం భావాలకు ఆకర్షితుడై.. విద్యార్థి దశ నుంచే పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ప్రజాప్రతినిధిగా పాతర్లపాడు సర్పంచ్‌గా రెండుసార్లు పని చేయగా.. ఆయన భార్య బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీపీఎం నుంచి గెలిచి సర్పంచ్‌గా పనిచేశారు. రామారావు చింతకాని మండల సీపీఎం పార్టీ కార్యదర్శిగా, ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా, జిల్లా రైతు సంఘం కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎం రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పని చేశారు. ఆయన గత ఐదేళ్ల నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండి గ్రామంలోని సొంత వ్యవసాయం చేస్తున్నారు.

● గ్రామంలో పలు రాజకీయ హత్యలు

పాతర్లపాడు గ్రామంలో గత 50 ఏళ్లుగా అనేక రాజకీయ హత్యలు జరిగాయి. 1986లో గ్రామానికి చెందిన చేబ్రోలు లక్ష్మీనారాయణ రాజకీయ హత్య గావించబడ్డాడు. అంతకు ముందు మరో రెండు రాజకీయ హత్యలు జరిగాయి. 1992లో ఓ సారి సామినేని రామారావుపై ప్రత్యర్థి పార్టీ నాయకులు దాడి చేసేందుకు ప్రయత్నించగా.. ఆయన వారిని అడ్డుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. 39 ఏళ్ల తర్వాత రామారావు హత్య జరగడంతో గ్రామం మరోసారి వార్తల్లో నిలిచింది.

● హత్యను ఖండించిన పలు పార్టీలు:

సీపీఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావు హత్యను అన్నీ పార్టీల నేతలు ఖండించారు. ఆయన హత్య దురదృష్టకరమన్నారు. రాజకీయాలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవితం గడుపుతున్న రామారావును హత్య చేయడం తీవ్రంగా ఖండించారు. దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

● రామారావు అంత్యక్రియలకు హాజరైన తమ్మినేని వీరభద్రం

ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రామారావు మృతదేహాన్ని స్వగ్రామం పాతర్లపాడుకు తరలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. హత్యా రాజకీయాలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తుందన్నారు. సీపీఎం పార్టీను ఎదుర్కొనలేక రామారావును రాజకీయ హత్య చేసిందన్నారు. ఎర్ర జెండాను అనగదొక్కాలనే చూస్తే మట్టిలో కలసిపోతారన్నారు. రామారావు ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగిస్తామన్నారు. నిజాయితి నిబద్ధత కలిగిన నేత సామినేని రామారావు అన్నారు. సభ అనంతరం పోలీసు బందోబస్తు నడుమ రామారావు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జూలకంటి రంగారెడ్డి, పొన్నం వెంకటేశ్వర్లు, మాదినేని రమేష్, వై విక్రం, బండి రమేష్, మడుపల్లి గోపాలరావు, రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు పాల్గొన్నారు.

దర్యాప్తు వేగవంతం

ఖమ్మం సీపీ సునీల్‌దత్



బందోబస్తును పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

సామినేని రామారావు హత్య వెనుక ఉన్న దుండగులను వెంటనే పట్టుకుంటామని ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. పాతర్లపాడులో ఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. హత్య చేసిన వారు తప్పించుకోలేరని ఎక్కడున్నా పట్టుకుంటామన్నారు. ఘటన ప్రాంతంలో కొన్ని ఆధారాలు సేకరించామని, బృందాలుగా విడిపోయి దర్యాప్తును ముమ్మరం చేసి దోషులను పట్టుకుంటామన్నారు. ఇందుకోసం ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

పింఛనేదారులు జీవన ప్రమాణ పత్రం సమర్పించాలి

- మొబైల్ యాప్ ద్వారానూ అవకాశం
- ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శ్రీనివాస్

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్వో పింఛన్‌దారులు జీవన ప్రమాణ పత్రాన్ని మొబైల్ యాప్ ద్వారా అందించవచ్చని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల భవిష్యనిధిసంస్థ (ఈపీఎఫ్‌వో), వరంగల్ ప్రాంతీయ కార్యాలయం తమ పరిధిలోని పింఛనుదారుల కోసం జీవన ప్రమాణ పత్రం (లైఫ్‌సర్టిఫికెట్) అందించే ప్రక్రియను మరింత సులభతరం చేసిందన్నారు. పింఛన్ దారులు ఇకపై ఫేస్ ఆధారిత గుర్తింపు యాప్, ఉమంగ్ యాప్ ద్వారా వారి జీవన ప్రమాణ పత్రాన్ని మొబైల్ ద్వారానే అందించవచ్చని తెలిపారు. ఫేస్‌ఆధారిత గుర్తింపు యాప్ ద్వారా పింఛనుదారులు కేవలం తమ ముఖాన్ని చూపించడం ద్వారా ధృవీకరణ పూర్తవుతుందని, గతంలో వృద్ధాప్యంలో ఉన్న పింఛన్‌దారులకు వేలిముద్రలు సరిగా నమోదు కాకపోవడంతో పింఛను నిలిపివేసిన సందర్భాలు ఎదురయ్యాయని, ఇప్పుడు అలాంటి సమస్యలు తొలగనున్నట్లు తెలిపారు. పింఛన్‌దారులు ఈపీఎఫ్వో నుంచి పెన్షన్ కొనసాగించేందుకు ఫేస్‌ఆధారిత గుర్తింపు యాప్ ద్వారా లేదా మీసేవా/ఈ- సేవా కేంద్రాలు, పోస్టాఫీస్ ద్వారా డిజిటల్ జీవన ప్రమాణ పత్రాన్ని సమర్పించవచ్చని తెలిపారు. ప్రతీ సంవత్సరం నవంబరులోనే జీవన ప్రమాణ పత్రం సమర్పించాల్సిన అవసరం ఉందని, ఇక నుంచి ఏ నెలలోనైనా జీవన ప్రమాణ పత్రం సమర్పించవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం వరంగల్ పీఎఫ్ కార్యాలయాన్ని0870-2447772/ 9440965784 నంబర్లలో, ఖమ్మం జిల్లా పీఎఫ్ కార్యాలయాన్ని 0874-2223994 నంబరులో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హత్యా రాజకీయాల సంస్కృతి మంచిది కాదు

సీపీఎం భద్రాద్రి జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

కొత్తగూడెంఅర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హత్యా రాజకీయాల సంస్కృతి మంచిది కాదని సీపీఎం భద్రాద్రి జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. చింకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన రైతుసంఘం రాష్ట్ర నాయకుడు, సీపీఎం సీనియర్ నాయకుడు సామినేని రామారావును హత్య చేశారు. శుక్రవారం మంచికంటి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హత్య జరిగినతీరు రాజకీయాలతో ముడిపడి ఉందని, కార్యకర్తలు, నాయకులను సమిధలుగా చేసే సంస్కృతి మంచికాదని, రాబోయే స్థానిక ఎన్నికల్లో సీపీఎంను ఎదుర్కోలేక కాంగ్రెస్ అనుచరగణం హత్యకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. ఈ హత్యకు మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బాధ్యత వహించాలని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ హత్య రాజకీయాలను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రామారావు మృతికి సీపీఎం జిల్లా కమిటీ ఘన నివాళులు అర్పించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే. రమేష్, నాయకులు కొలగాని బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, బి. రమేష్, నందిపాటి రమేష్, జలాల్ పాల్గొన్నారు.

తప్పని కష్టం.. ఏటా నష్టం!

మున్నేరు బాధితుల గోడు

- మొంథా ప్రభావంతో నీట మునిగిన ఖమ్మం వీధులు
- రిటైనింగ్ వాల్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- ముంపు శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వ చర్యలు తీసుకోవాలి
- మున్నేరు ముంపు ప్రాంతవాసుల డిమాండ్

మున్నేరు... ఖమ్మం నగర వాసులకు కునుకులేకుండా చేస్తోంది.... మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలు ఏటా వర్షాకాలంలోనే వరదలు వస్తాయనుకుంటే వారి అంచనాలకు మించి ఆ కాలం.. ఈ కాలం అనే తేడా లేకుండా ముంచేస్తోంది. తాజాగా మొంథా తుఫాన్ కారణంగా మున్నేరుకు వరద ఉధృతం అయ్యింది. బుధవారం రాత్రి నుంచి శుక్రవారం వరకు బాధితులకు కునుకులేకుండా చేసింది. ఈ మూడు రాత్రులు వారు పడిన ఇబ్బందులు వారి మాటల్లోనే....!

ఖమ్మంఖానాపురంహవేలీ/ఖమ్మం మార్కెట్, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వాగుకు రెండు వైపులా రిటైనింగ్ వాల్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, రక్షణ గోడలను పూర్తిచేసి రక్షణ కల్పించాలని మున్నేరు ముంపు ప్రాంత ప్రజలు అధికారులను కోరుతున్నారు. గత రెండు ఏళ్ల నుంచి మున్నేరుకు అధికంగా నీరు రావడంతో ఉగ్రరూపం దాల్చుతుంది. దీంతో కట్టుకున్న ఇండ్లను వదిలి అనాథల్లా రోడ్లపై, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాలల్సి పరిస్థితులు ఏర్పాటుతున్నాయని, ఇండ్లలోని సామాన్లు, నిత్యవసర వస్తువులు, బియ్యం, రోజువారి కూలీల డబ్బులు, పిల్లల చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు తదితర సామగ్రి మొత్తం వరదలకు పాడైపోతున్నాయి. వరద తగ్గిన తర్వాత తిరిగి ఇండ్లకు చేరుకుంటే.. కనీసం రెండు నుంచి మూడు రోజులు ఇండ్లు శుభ్రం చేసుకునేందుకే సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ కూలి పనులకు పోతేనే పూట గడవడం కష్టంగా ఉన్న మాకు ఈ వరదల కారణంగా అప్పుల పాలవుతున్నామని పలువురు బాధితులు ఆంధ్రజ్యోతితో వాపోయారు. ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డ, పద్మావతి నగర్, ధంసలాపురం, వెంకటేశ్వర నగర్, ఎఫ్‌సీఐ గోదాం ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మున్నేరు పొంగటంతో పలు కాలనీలు నీటితో నిండంతో స్థానిక ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లగా ఆటోనగర్‌లో పలు వాహనాలు నీట మునిగి సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని వాహనదారులు వాపోయారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో రిటైనింగ్ వాల్ పనులు ప్రారంభించినప్పటికీ సకాలంలో పూర్తికాక పోవటంతో ముంపు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. ధంసలాపురం కాలనీ వరకు రిటైనింగ్ వాల్ నిర్మించి వరద ముంపు నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పాములతో భయంగా ఉంది

శ్రీరాదాసు ఉషా, ధంసలాపురం



మా ఇల్లు మున్నేరుకు దగ్గరలో ఉంది. భారీ వర్షాలకు మున్నేరు పొంగడంతో విషపు కీటకాలతో భయంగా ఉంది. రెండు రోజుల క్రితం వచ్చిన వరదలకు మా ఇల్లు లోపల వరకు నీరు చేరింది. సామాను మొత్తం పాడయ్యాయి. మూడేళ్ల క్రితమే ఇల్లు కట్టుకున్నాం. ఉన్న డబ్బుల తో పాటు కొంత అప్పుచేసి ఇల్లు కట్టుకున్నాం. వరదల సమయంలో భయంగా ఉంటుంది. కరకట్ట నిర్మించి వరదల నుంచి రక్షణ కల్పించండి.

బంధువుల ఇంట్లో తలదాచుకున్నాం..

పండగ సత్యం, బొక్కలగడ్డ



ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మున్నేరు పెరగంతో. ఇంట్లోని సామాను వదిలేసి ప్రాణ భయంతో బైటకు వచ్చాము.. గాంధీచౌక్‌లోని మా బంధువుల ఇంట్లో తలదాచుకున్నాను. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా సామాను పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. గతేడాది వరదలకు కూడా ఇల్లు పూర్తిగా మునిగి రూ. రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. ప్రస్తుతం రూ.50 వేలు వరకు నష్టం వాటిల్లింది.

ధంసలాపురం వరకు ఏర్పాటు చేయాలి

ఎన్.నాగేశ్వరరావు, ధంసలాపురం



ధంసలాపురం వరకు మున్నేరుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించి వరదల ముంపు నుంచి కాపాడాలి. గత ఏడాది వరదలకు, రెండు రోజుల క్రితం వచ్చిన వరదకు నా ఇల్లు నీటిలో మునిగింది. ఇంటి గోడలు, ప్రహరీ, బాత్రూం పూర్తిగా పడిపోయాయి. ప్రభుత్వం అందించిన సమాయం తప్ప మాకు ఎవరి సహాయం అందలేదు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది.

ఏటా ఇబ్బందులు తప్పడం లేదు!

కేసగాని రవి, మోతీనగర్



ప్రతి ఏటా మున్నేరు వరదకు మోతీనగర్‌తో పాటు ఆటోనగర్ మెకానిక్‌లకు ఇబ్బందులు తప్పడం లేదు. వరద వస్తుందంటేనే సామాన్లు సర్దుకోవాల్సి వస్తోంది. వరద వస్తుందంటేనే కునుకుపోని పరిస్థితులు ఉంటుంది. ప్రతి ఏటా ఆగస్టు, సెప్టెంబర్ నెలలో వచ్చి వర్షార్పణం అవుతున్నాయి. ఈ సారి మొంథా తుపాన్ నిలువునా ముంచింది. మెకానిక్ షెడ్లన్నీ నీటమునిగిపోయాయి. ఈ కష్టానికి శాశ్వత పరిష్కారాన్ని ప్రభుత్వం చూపాలి.

ఏటా నష్టపోతున్నాం..

వడ్లకుంట సూరమ్మ, బొక్కల గడ్డ



ఏటా వరద కష్టం... నష్టం తప్పడం లేదు. బుధవారం రాత్రి నుంచి ఇబ్బందులు పడుతున్నాం. పునరావాస కేంద్రంలో ఉండి వచ్చాం. సామాన్లన్నీ సర్దుకోవడం.. ఇల్లంతా బురదమయం అవడం ఏటా వాటిని బాగుచేసుకోవడం ఇబ్బందిగా ఉంది. మున్నేరు వరదకు శాశ్వత పరిష్కారం చూపాలి.

రెండు నెలలు అద్దెకు...

పూల పద్మ, వెంకటేశ్వరనగర్



ఆగస్టు, సెప్టెంబర్ నెలలో వరదలు వస్తాయని బయటి ప్రాంతంలో అద్దెకు ఉండి ఈ నెలే వచ్చాం. వర్షాలు, వరదలు రావనుకున్నాం. మాయదారి తుఫాన్ ఒక్క రోజులోనే ముంచేసింది. ఇంట్లో సామాన్లన్నీ మునిగిపోయాయి. వరద తీరని నష్టాన్ని మిగిల్చింది. ఇంత కష్టం ఎవ్వరికీ రావద్దు.. ఏటా ఈ కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం వరదల నివారించేందుకు కరకట్టలు నిర్మిస్తున్నా వాటిని పూర్తి చేయక పోవడం వలన ఇబ్బంది వస్తోంది.

సామగ్రి మొత్తం పాడైంది

అంకస్ అలీ, పద్మావతినగర్



మున్నేరు రిటైనింగ్ వాల్ పనులకు అస్సాం నుంచి వచ్చాం. పద్మావతి నగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాం. వచ్చిన వరదకు ఇంట్లోని వంట సామాను, సిమెంట్ తదితర సామగ్రి పూర్తిగా మునిగిపోయింది. పొట్టకూటి కోసం వచ్చి పనులు చేసుకుందామనుకుంటే వరదలకు ఇబ్బందులు పడుతున్నాం. సుమారు రూ.50వేలు నష్టపోయాం.. అధికారులు ఆదుకోవాలి.

వానొస్తుందంటే భయమేస్తుంది

వెంకాయమ్మ, మంచికంటి నగర్



వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు వరద వస్తుందోనని భయమేస్తుంది. సరిగ్గా 13 నెలల క్రితం వచ్చిన వరద నాజీవితంలో మరువలేనిది. మళ్ళీ అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలని కోరుకుంటున్నా. మళ్ళీ భయంకరమైన కాళరాత్రిని ఇక మీదట చూడకుండా ఉండాలి. ఇరు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణంతో సమస్య పరిష్కారమవుతుందని నమ్మకం ఉంది.

రూ.పది లక్షల నష్టం వాటిల్లింది!

పి.గణేష్, కార్ మెకానిక్



ప్రతి ఏటా ఆకస్మికంగా వచ్చిన వరదలకు నష్టపోతూనే ఉన్నాం. ఇప్పుడేమో అనుకోకుండా వచ్చిన వరద తీరని నష్టాన్ని మిగిల్చింది. గత నెలలో వరదలు వస్తాయని ఈసారి జాగ్రత్తపడ్డాం. కానీ రాత్రికి రాత్రే వరద వచ్చి కార్లన్నీ మునిగిపోయాయి. దీంతో రూ.10లక్షల నష్టం వాటిల్లింది. ఏసీ మిషన్లు, సామాన్లు మునిగిపోయాయి. రక్షణ గోడ కడితే ఇంత నష్టం ఉండేది కాదు.

ఈసారి ముందే మేల్కొలిపారు

కొండలు బొక్కలగడ్డ



వరద వస్తుందని అధికారులు ముంపు ప్రాంతం వారిని ముందే మేల్కొ లపడం సంతోషంగా ఉంది. అధికారులు స్పందించి ఈ ప్రాంత వాసులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అధికారులు అకస్మాత్తుగా వరద రాకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలి. అప్పుడే ఈ ప్రాంత ప్రజలకు ధైర్యం వస్తుంది.



ముంపునకు గురైన కార్లు ఇవే..





ఇంటిలోని సామాను శుభ్రం చేస్తున్న దృశ్యం



వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు



వీధులను శుభ్రం చేస్తున్న కార్మికులు





మున్నేరు వరద దృశ్యం

అండర్ 17 కబడ్డీ పోటీలకు ఆహ్వానం

- జాతీయ, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- 8 నుంచి 10 వరకు రాష్ట్రస్థాయి బాల బాలికలకు పోటీలు
- జనవరి 7 నుంచి 11 వరకు బాలురకు జాతీయస్థాయి పోటీలు
- మహారాష్ట్ర అహల్యనగర్‌లో బాలికల కబడ్డీ పోటీలు



క్రీడా పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెంజిల్లా పినపాక నియోజకవర్గం పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే జాతీయ, రాష్ట్రస్థాయి అండర్ -17 బాల బాలికల కబడ్డీ పోటీలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రీడలకు సంబంధించిన వివరాలను తెలిపారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యూకేషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ సారధ్యంలో ఇతర అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏడూళ్ల బయ్యారం జెడ్పీ హైస్కూల్ మైదానంలో నవంబరు 8 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అండర్- 17 బాల బాలికలకు కబడ్డీ పోటీల నిర్వహణ జరుగుతుందన్నారు. డే అండ్ నైట్ మ్యాచ్‌లను నిర్వహించేందుకు మైదానంలో తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రో కబడ్డీ పోటీ ల నిర్వహణ ఉంటుందని అలాగే క్రీడా పోటీల్లో పాల్గొనే 300 మంది క్రీడాకారులతో పాటు జట్టు మేనేజరు, కోచ్ ఇతర సిబ్బందికి కంది చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానికులు కంది సుబ్బారెడ్డి వసతి, భోజన వసతిని సమకూర్చడం జరుగుతుందన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏజెన్సీలో నిర్వహించే పినపాక పుర ప్రముఖులు సంపూర్ణ సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చారన్నారు.

ఈ క్రీడాపోటీల్లో ప్రతి భ చూపిన జట్టును రాష్ట్ర జట్టుగా ఎంపిక చేయ డం జరుగుతుందన్నారు. ఎంపైన బాలుర బాలకల జట్లు జనవరిలో జరిగే జాతీయ క్రీడల్లో పాల్గొంటాయని తెలిపారు. ఎంపికైన బాలుర జట్టు జనవరిలో ఏడూళ్ల బయ్యారంలోనే నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారని, బాలికలు మాత్రం మహారాష్ట్రలోని అహల్యాలో జరిగే పోటీలకు హాజరవుతారన్నారు. జాతీయస్థాయి పోటీలకు సంబంధించి దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచే కాకుండా కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారులు ఏడూళ్ల బయ్యారం రానున్నారని తెలిపారు. దాదాపు 600 మంది క్రీడాకారులు ఈ జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనబోతున్నారని తెలిపారు. మారుమూల ఏజెన్సీలో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి అండర్ -17 బాలబాలికల కబడ్డీ పోటీల నిర్వహణకు అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోటీల నిర్వహణపై కలెక్టర్ జితేష్ ఇప్పటికే పలుమార్లు అన్ని శాఖల అధికారులతో స్వచ్ఛందంగా సహకరించేందుకు సమావేశాలను నిర్వహించారని తె లిపారు. ఈ పోటీల విజయవంతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పినపాక ఎంపీడీవో సంకీర్త్, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో నాగయ్య, నాయకులు కంది సుబ్బారెడ్డి, మణుగూరు మండల నాయకులు నవీన్, శివ సైదులు, కూచిపూడి బాబు, సుబ్బారెడ్డి, టి.శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ సన్నాహక ప్రక్రియను గడువులోగా పూర్తిచేయాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రత్యేక ఇన్టెంటీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) సన్నాహక ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ధిష్ట గడువు లోపు పూర్తిచేయాలని భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా అసిస్టెంట్ ఎలక్షన్ రిజిస్టరింగ్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు, బీఎల్‌వో సూపర్వైజర్లతో ఎస్ఐఆర్ పూర్వ సన్నాహక ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ సన్నాహక ప్రక్రియను పారదర్శకంగా, తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని నిర్ధిష్టరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా పనిచేసి అర్హులైన ప్రతీ ఓటరు పేరు జాబితాలో తప్పకుండా ఉండేలా నిశితంగా పరిశీలన జరపాలని సూచించారు. 2022 సంవత్సరపు ఓటరు జాబితాను 2025 సంవత్సరం జాబితాతో మ్యాపింగ్ చేసి నాలుగు కేటగిరిలుగా విభజించినట్లు గుర్తు చేశారు. ముందుగా మ్యాపింగ్ చేయబడిన కేటగిరి ఏ జాబితాను బీఎల్‌వో యాప్ ద్వారా ధ్రువీకరించి, అది ఎన్నికల సంఘం పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం కేటగిరి సి, కేటగిరి డిలోని ఓటర్లను ఏ కేటగిరికి మ్యాపింగ్ చేసే ప్రక్రియను ఏఈఆర్‌వోల ఆధ్వర్యంలో బీఎల్‌వో సూపర్వైజర్లు, బీఎల్‌వోలు, బీఎల్‌వో యాప్ ద్వారా పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా, ప్రజా పాలన రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన సాదా బైనామా, అసైన్డ్ భూముల పెండింగ్ దరఖాస్తులను నవంబరు 3వ తేదీలోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీరోజు పరిష్కరించిన దరఖాస్తులపై వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని, తిరస్కరించిన దరఖాస్తులపై తగిన కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్యాంకర్

దంపతులకు తీవ్రగాయాలు



కొణిజర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో ఆయిల్ ట్యాంకర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో భార్యభర్తలకు తీవ్రగాయలైన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీస్‌ల కథనం ప్రకారం కల్లూరు మండలం వాత్యానాయక్ తండాకు చెందిన బానోతు రవి, బానోతు సంధ్యశ్రీ ద్విచక్రవాహనంపై ఖమ్మంలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో ఉన్న బంధవుల వద్దకు వెళ్లి వస్తున్న క్రమంలో తనికెళ్ళ సమీపంలో వీరి ద్విచక్ర వాహనాన్ని, వైరా వైపు నుంచి ఖమ్మం వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ వారిని ఢీకొట్టి రోడ్డుపక్కన పల్టీకొట్టింది. ట్యాంకర్‌లోని ఆయిల్ మొత్తం నేలపాలైంది. ఈ ప్రమాదంలో రవి, సంధ్యశ్రీలకు కాళ్లకు తీవ్రగాయ లయ్యాయి. 108ద్వారా క్షతగాత్రులను ఖమ్మం తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించిన్నట్లు బంధువులు తెలిపారు. పోలీసులు ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు.

అలుగు వరదలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం



బానోత్ శ్రీను(ఫైల్)

కామేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి అలుగు వరదలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కామేపల్లి మండలం పాతలింగాల చెరువు కట్ట వర్షాలకు కుంగడంతో ఇరిగేషన్, పోలీస్ అధికారులు అలుగుకు ఉన్న వలను, అలుగును కొంతమేరకు తొలగించారు. దీంతో చేపలు బయటకు వస్తున్నాయి అనే ప్రచారం జరగడంతో చుట్టుపక్కల గ్రామ ప్రజలు తెలిసి వారివద్ద ఉన్న వలలు తీసుకొనివచ్చారు. కానీ పోలీసులు ఎవర్నీ అలుగు వద్దకు అనుమతించలేదు. అక్టోబరు 30న మధ్యాహ్నా సమయంలో పోలీసులు కళ్లుకప్పి అలుగు వరద ప్రాంతంలో చేపల వలలు వేసి చేపలను పట్టబోయారు. అందులో గోవింద్రాల గ్రామానికి చెందిన బానోత్ శ్రీను(34) చేపల వల పట్టబోయి ప్రమాదవ శాత్తు అలుగు వరదలో కాలు జారింది. పక్కన బంధువు కాపాడే ప్రయత్నం చేసేలోపే వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. పోలీసులు విషయం తెలుసుకొని గాలింపు చర్యలు చేపట్టినా ఎలాంటి ఆచూకీ తెలియలేదు. రాత్రి కావడంలో గాలింపు చర్యలను నిలిపేశారు. శుక్రవారం బానోత్ శ్రీను మృతదేహం వరద ఉధృతికి కొట్టు కువచ్చి చెక్‌డ్యాం సమీపంలో తేలడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, పోలీసులు సంయుక్తంగా మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలిం చారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతదేహాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళ్లు అర్పించి, మనోధైర్యం కల్పించారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు.

మూడో రోజూ లభించని డ్రైవర్ ఆచూకీ

కొట్టుకుపోయిన డీసీఎం వ్యాన్ లభ్యం

గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం



డీసీఎం వ్యానును తీస్తున్న దృశ్యం

కొణిజర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నిమ్మ వాగులో మొంథా తుఫాన్ వరదలకు కొట్టుకుపోయిన డీసీఎం వ్యాను, గల్లంతైన డ్రైవర్ ఆరేపల్లి మురళీకృష్ణ కోసం మూడవ రోజు శుక్రవారం ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచే వాగులో గాలింపు చర్యలకు దిగిన ఎన్డీఆర్ఆఫ్ బృందంకు వరద ఉధృతి తగ్గడంతో డీసీఎం వ్యాను కనిపించింది. దానిని బయటకు తీశారు. వ్యాను డ్రైవర్ మాత్రం కనిపించక పోవడంతో సాయంత్రం వరకు గాలించారు. డ్రైవర్ వరదలో వ్యాను కొట్టుకుపోయిన సమయంలో బయటకు రావడంతో వరదలో కొట్టుకుపోయి ఉంటాడా, వాగులోనే ఇసుక మేటలో కూరకపోయి ఉంటాడా అనే సందేహాలపై బృందం గాలిస్తుంది. ఈ సందర్భంగా ఎస్ఐ సూరజ్ మాట్లాడుతూ ఎన్డీఆర్ఎఫ్ బృందంతో వాగు మొత్తం గాలించామని, డీసీఎం వ్యాను మాత్రమే కనిపించదని, డ్రైవర్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని తెలిపారు. నిమ్మవాగు నుంచి వైరా రిజర్వాయర్ వరకు గాలింపు చర్యలు చేపడతామని తెలిపారు.

తీవ్రంగా గాయపరిచిన వ్యక్తికి జైలుశిక్ష

కొత్తగూడెం లీగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన కేసులో ఒకరికి జైలుశిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.కిరణ్‌కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం గిరిప్రసాద్ కాలనీకి చెందిన మునుగపాటి మంగమ్మ ఫిర్యాదు ప్రకారం కోటమ్మ అనే మహిళా తన భర్త రాంబాబుతో అక్రమ సంబంధం పెట్టుకోగా అదే కాలనీలో ఇల్లు కట్టించి ఉంచాడాని.. కానీ కోటమ్మ వేరే వ్యక్తి అయిన గోరంట్ల లక్ష్మీనారాయణతో అక్రమ సంబంధం ఏర్పరుచుకుని తన భర్తను రావద్దని చెప్పగా.. తన భర్త వెళ్లడం మానేసి తన తోటే ఉంటున్నాడని పేర్కొంది. ఈక్రమంలో నెల రోజుల క్రితం తన భర్త కోటమ్మ ఇంటి ముందు నుంచి వెళ్తుండగా లక్ష్మీనారాయణ కోటమ్మ ఇంటి వద్ద ఉండటం చూసి కోటమ్మను పిలిచి ఇది నేను కట్టించిన ఇల్లు, ఆమెని మాత్రమే ఉండమని, లక్ష్మీనారాయణ ఉండటానికి వీలులేదని మందలించాడు. ఆ విషయంలో ఇద్దరూ కక్ష పెంచుకుని తన భర్తను ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో 2019 జూన్ 24న మధ్యాహ్నం తన భర్త పని ముగించుకుని ఇంటికి వస్తుండగా తన భర్తపై గోరంట్ల లక్ష్మీనారాయణ కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలైనాయి. ఈ విషయం తెలిసిన వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించినట్లు తెలిపింది. చుట్టుపక్కల వారు అడ్డుకోగా వారు పారిపోయారని తెలిపింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు చుంచుపల్లి పీఎస్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో 9 మంది సాక్షుల విచారణ అనంతరం గోరంట్ల లక్ష్మీనారాయణపై నేరం రుజువు కాగా మూడు సంవత్సరాల కారాగార శిక్ష రూ.10,000 జరిమానా.. చెల్లించాలని లేనియెడల మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పునుగుపాటి కోటమ్మపై నేరం రుజువు కాలేదని కేసు కొట్టివేశారు. కారం రాజారావు ప్రాసిక్యూషన్‌ను నిర్వహించారు. ప్రస్తుత లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ జి.రమణారెడ్డి, కోర్టు నోడల్ ఆఫీసర్ డి.రాఘవయ్య, కోర్టు లైజన్ ఎం.శ్రీనివాస్, పీసీఎస్ అశోక్‌లు సహకరించారు.

లింగాల చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే



కామేపల్లి,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతలింగాల చెరువుకట్ట ముంథా తఫాన్ ప్రభావంతో కట్ట కుంగిపోవడంతో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం పరిశీలించారు. కట్ట తెగకుండా యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శంకర్, ఎఈఈలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేలకొండపల్లి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి, కొత్తకొత్తూరు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవి ఫీడర్ మరమ్మత్తులు, చెట్ల కొమ్మలు నరకటంతో పాటుగా చిన్న చిన్న పనులు చేయటానికి వీలుగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రకటనలో తెలిపారు. నేలకొండపల్లి, కొత్తకొత్తూరు వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులతో సహకరించాలని ఏఈ రామారావు ప్రకటనలో కోరారు.

ఇందిరా త్యాగాలు వృథా కావు

కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొడాలి, మాజీ ప్రధానికి ఘన నివాళి



నేలకొండపల్లి,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి):దేశ మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు వృథా కావని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొడాలి గోవిందరావు అన్నారు.శుక్రవారం నేలకొండపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీప్రధాని ఇందిర 41వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఇందిర చిత్రపటానికి పూలమాలలేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఇందిరాగాంధీదేనన్నారు. రాజభరణాలను రద్దు చేయటంతో పాటుగా ఎన్నో సంస్కరణలు తెచ్చిన ధీర వనిత ఇందిర అని కొనియాడారు. ఇందిర సేవలను దేశం మర్చిపోదన్నారు.కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, షేక్.ఖాజామియా, కట్టెకోల నాగార్జున, బొడ్డు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, లక్కం ఏడుకొండలు, చింతనిప్పు సైదులు,వాకా శ్రీనాధ్ పాల్గొన్నారు.

74,500 ఎకరాల్లో పంట నష్టం

పాలేరు నియోజకవర్గంలో అధికారుల ప్రాథమిక అంచనా | దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అదనపు కలెక్టర్





కూసుమంచి మండలం మల్లాయిగూడెంలో నేలవాలినవరిని లేసుతున్న రైతులు, పంటలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కూసుమంచి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రెండురోజులపాటు కురిసిన వర్షం వరి రైతులను నిండా ముంచింది. పాలేరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సుమారు 74,500 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కూసుమంచి మండలంలో 24,000 ఎకరాలు, నేలకొండపల్లిలో 28,500, తిరుమలాయపాలెం 14,000, ఖమ్మంరూరల్ 8000 ఎకరాల్లో పంట నష్టం సంభవించిందని ఉన్నతాధికారులకు నివేదించారు.

పొలంలో నీటిని తొలగించాలి: ఏవో వాణి

పొలంలో నిల్వఉన్న వర్షపునీటిని వెంటనే తీసివేయాలని కూసుమంచి ఏవో వాణి తెలిపారు. రైతులకు పలుసూచనలు చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పొలాలు నీటమునిగితే లీటరు నీటికి 50గ్రాముల చొప్పున ఉప్పును కలిపి ద్రావణాన్ని పిచకారీ చేస్తే గింజలు మొలకెత్తకుండా ఉంటాయని రైతులకు సూచించారు.

పంటలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ శ్రీజ

ఖమ్మంరూరల్: ముంథా తుఫాన్ ప్రభావంతో మున్నేరు ఆయకట్టు ప్రాంతంలో మునిగిన పంటలను అడిషనల్ కలెక్టర్ శ్రీజ శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని గోళ్లపాడు, తీర్థాల, పోలేపల్లి గ్రామాల పరిధిలోని మున్నేరు ఆయకట్టు ప్రాంతాల్లోని వరదలకు మునిగిన పంటపొలాలను సందర్శించారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు నోటికాడికి వచ్చి నీట మునిగడంతో అన్నదాతలు తీవ్రంగా నష్ట పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి వరిపంటకు సుమారు రూ.50వేల వరకు పెట్టుబడులు పెట్టామని ఆమె దృష్టికి తీసుకువెల్లారు. నోటికాడికి వచ్చిన పంటలు తుఫాన్‌తో మునిగిపోవడంతో తీవ్రనష్టం జరిగిందని నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు ఆమెను కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. తుఫాను ప్రభావంతో మండలంలో ఎంతమేర నష్టం జరిగి ఉంటుందని వ్యవసాయఅధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఈ పంటలను పరిశీలించాలని సూచించారు. తుఫాన్ ప్రభావంతో తడిచిన పంటలకు సంబంధించిన నవివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని రైతులకు అడిషనల్ కలెక్టర్ శ్రీజ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ఉమా నగేష్, ఏఈవోలు రైతులు మద్ది వీరారెడ్డి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది: ఏవో

తిరుమలాయపాలెం,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): అకాలవర్షంతో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, క్షేత్రస్థాయిలో పంటల నష్టం అంచానా వేసి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఏవో సీతారాంరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పాతర్లపాడు, జల్లేపల్లి, హైదరసాయిపేట, తిప్పారెడ్డిగూడెం, అజ్మీరతండా తదితర గ్రామాల్లో వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలోని 21 గ్రామాల్లో పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నట్టు గుర్తించామని, వరి పంట 39.08ఎకరాలు, పత్తి 2348వేల ఎకరాలు, మిర్చి 1754ఎకరాల్లో నష్టం జరిగిందన్నారు. ఆకేరువరదతో హైదరాయిపేట, పడమటతండా, అజ్మీరతండా, తిప్పారెడ్డిగూడెం, రాకాసితండా బాలాజీ నగర్‌తండా, తిరుమలాయపాలెంలో ఎక్కువ నష్టం జరిగినట్టు తెలిపారు. నష్టం వివరాలను జిల్లా అధికారులకు నివేదిక పంపినట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు నవనీత, ప్రదీప్,ఉపేందర్, బాలకృష్ణ పాల్గొన్నాను.



జల్లేపల్లిలో పంటలను పరిశీలిస్తున్న ఏవో

శంకుస్థాపనతో సరి నిర్మాణం ఎప్పుడో మరి?

నాలుగు నెలలుగా నిర్మాణం ప్రారంభంకాని రోడ్డు



ఖమ్మంకార్పొరేషన్,అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈ రహదారి ఏదో పల్లెటూరి దారి అనుకుంటే మీరు పొరపడినట్లే.. ఇది ఖమ్మం నగర పాలక సంస్థకు అత్యధిక ఆదాయం తెచ్చే ప్రాంతాల్లో ముందు వరసలో ఉండే 3వ డివిజన్‌లోని జయనగర్ కాలనీ... దివంగత మాజీకార్పొరేటర్ మలీదు జగన్ నివాసానికి వెళ్లే రహదారి.. నాలుగు నెలల క్రితమే సీసీరోడ్డు నిర్మాణానికి అధికారులు శంకుస్థాపన చేశారు. కానీపనులు నేటివరకు ప్రారంభం కాలేదు. దీంతో ఆ ప్రాంతంలో నడిచేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా ఈ విషయంపై కేఎంసీ పబ్లిక్ ఎస్ఈ రంజిత్ కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాక పోవటంతో కాంట్రాక్టర్లుపనులు చేసేందుకు ముందుకు రావటం లేదన్నారు. బతిమిలాడి టెండర్లు వేయించామని, రోడ్డు నిర్మాణంపై తామేమి చేయలేమన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

- సీపీ సునీల్‌దత్
- నేలకొండపల్లిలో మెగా రక్తదాన శిబిరానికి హాజరు





రక్తదానం చేస్తున్న తుంబూరు దయాకర్‌రెడ్డి, మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

నేలకొండపల్లి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): సమాజంపై బాధ్యతతో మీరిచ్చే రక్తదానం ప్రాణదానంతో సమానమని, పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహించటంతో పాటుగా,సమాజంలో ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సీపీ సునీల్‌దత్ చెప్పారు. పోలీస్ సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఖమ్మంరూరల్ సబ్-డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం నేలకొండపల్లి, మార్కెట్ యార్డులో జరిగిన మెగారక్తదాన శిబిరంలో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏసీపీ బి.తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తంతో ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టవచ్చన్నారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనన్నారు. ఎంతోమంది తలసీమియా బాధితులతో పాటుగా రోడ్డుప్రమాదంలో గాయపడిన వారు, ఇతరత్రా ప్రాణాపాయస్థితిలో ఉన్నవారిని కాపాడవచ్చన్నారు. పోలీస్ శాఖ నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో సేకరించిన రక్తంతో ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టబడ్డాయన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులను నిర్వహిస్తున్న పోలీసులు ఎంతో మంది విధి నిర్వహణలో అమరులయ్యారని, వారి స్మారకార్థం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన రావటం గొప్ప విషయమని సీపీ సునీల్‌దత్ అన్నారు. శిబిరంలో రక్తదానం చేసిన మంత్రి పొంగులేటి క్యాంపుకార్యాలయ ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

సహకరించిన అందరికీ ధన్యవాదాలు ఏసీపీ తిరుపతిరెడ్డి

మెగారక్తదాన శిబిరం విజయవంతం గావటానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి చెప్పారు. అనూహ్యంగా శిబిరంలో దాదాపుగా 1300 మంది రక్తదానం చేయటం ఎంతో గొప్ప విషయమన్నారు. మీరు దానం చేసిన ప్రతీ రక్తం చుక్కను సద్వినియోగం చేస్తామన్నారు. మెగా రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన రావటానికి కృషి చేసిన డివిజన్ పోలీసు అధికారులకు, సిబ్బందికి, ముఖ్యంగా కూసుమంచి సీఐ టి.సంజీవ్, నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోషలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ బి.రామానుజం, ఖమ్మం ఏసీపీ రమణమూర్తి, సీఐలు సంజీవ్, మురళి, సాగర్, రాజు, ఖమ్మంరూరల్ డివిజన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రవికుమార్

ఖమ్మంరూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ నూతన ఎంపీడీవో గా కే.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేట్టారు. టీజీపీఎస్‌సి గ్రూప్-1ద్వారా ఎంపికైన రవికుమార్ ఎంపీడీవోగా ఎంపికయ్యారు. రూరల్ మండలానికి నియమితులైన రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఉన్న ఎంపీవో శ్రీదేవి ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): నవంబరు7న హైదరాబాదులోజరిగే పెన్షనర్ల ఛలోహైదరాబాదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు కోరారు. శుక్రవారం సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 19 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ

ఖమ్మంరూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ఏదులాపురం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పీఎస్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ బైరు హరినాబాబు బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదవిద్యార్థుల అడుగులు తడబడకుండా బూట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థుల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

'చాంబర్'ఎన్నికల్లో పోటీదారుల తుదిజాబితా విడుదల

ఖమ్మంమార్కెట్, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): నవంబరు 16న జరగనున్న 'చాంబర్ ఆఫ్ కామర్స్' ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ శుక్రవారంతో ముగిసింది. బరిలో నిలిచే అభ్యర్థుల తుదిజాబితాను శుక్రవారం ఎన్నికల అధికారి శ్రీరాములు విడుదల చేశారు. ఈ జాబితాను వర్తక సంఘ భవన్ నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. ఎన్నికల్లో అధ్యక్ష పదవికి కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, మేళ్ల చెర్వు వెంకటేశ్వరరావు ప్యానల్‌తో పాటు ఇండిపెండెంట్లుగా కొదుమూరి మధుసూధన్ రావు, కొప్పుల కోటేశ్వరరావు పోటీలో ఉన్నారు. సెక్రెటరీ పదవికి గొడవర్తి శ్రీనివాసరావు, సోమా నర్సింహరావు, ఉపాధ్యక్ష పదవికి కురువెళ్ల లక్ష్మీకాంతరావు, బత్తిని నర్సింహరావు, సహాయ కార్యదర్శి పదవికి బాదె రమేష్, ముత్యం ఉప్పల్‌రావు, కోశాధికారి పదవికి కైలాసపు వేణుగోపాలరావు, తల్లాడ రమేష్, తూములూరి లక్ష్మీనర్సింహరావు, దిగుమతి శాఖ అధ్యక్ష పదవికి కోలేటి నవీన్‌కుమార్, వడ్డె వెంకటేశ్వర్లు, సోమిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పదవికి యాద్రా అప్పారావు, సోమారపు సుధీర్‌కుమార్, ఆత్మకూరి వెంకట రామారావు పోటీలో ఉన్నారు. మిర్చి శాఖ అధ్యక్ష పదవికి బండారు వీరబాబు, మెంతుల శ్రీశైలం, కార్యదర్శి పదవికి యడ్లపల్లి సతీష్, చింతల రామలింగేశ్వరరావు, ఎగుమతి శాఖ అధ్యక్ష పదవికి నల్లమల ఆనంద్, మన్నెం క్రిష్ణ, వెండి బంగారం శాఖ అధ్యక్ష పదవికి బందు సూర్యం, విజయగిరి సదానందచారి పోటీలో ఉన్నారు. సెక్రెటరీ పదవికి నకిరకంటి సతీష్, బూర్లె లక్ష్మీనారాయణ ప్యానల్‌లు, 10 మంది అభ్యర్థులు సెంట్రల్ ఈసీ మెంబర్లు బరిలో నిలిచారు. కాగా కోల్డ్‌స్టోరేజీ శాఖ, దాల్‌మిల్, ఆయిల్‌మిల్, క్లాత్ అండ్ రెడీమేడ్, కిరాణం, ఎగుమతి శాఖ కార్యదర్శి, డిస్ట్రిబ్యూటర్స్ జనరల్ మనియార్, సామిల్, ఇనుము, క్యాన్వాసింగ్, అగ్రికల్చర్ మోటార్స్ కలప, సిమెంట్, ధాన్యం శాఖలు అధ్యక్ష, కార్యదర్శి పదవులతో పాటు పలు శాఖల ఈసీ మెంబర్ల పదవులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి శ్రీరాములు తెలిపారు.

గోడలే.. ఖమ్మానికి 'రక్ష'ణ!

(5వ పేజీ తరువాయి)

నిర్మిస్తున్నారు. ఇందుకు రూ.690కోట్లవరకు నిధులు ఖర్చు కానున్నాయి. ఖమ్మంలోని దానావాయిగూడెం నుంచి ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వరకు ప్రస్తుతం ఈరక్షణ గోడలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 30శాతం పనులు పూర్తికాగా.. ఇంకా 70శాతం పనులు చేట్టాల్సి ఉంది. మొత్తం 239 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉండగా 140ఎకరాల ప్రైవేటు భూమి ఉంది. ప్రైవేటు భూయజమానులకు ప్రత్యామ్నాయం కింద ల్యాండ్ పూలింగ్ విధానం అమలు చేయాలంటే కేబినేట్ ఆమోదం కావాలి. దీంతో భూసేకరణ జరగకపోవడంతో రక్షణ గోడల నిర్మాణం జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ భూముల్లోనే వరద కట్టలపనులు జరుగుతున్నాయి. 6మీటర్లను 11మీటర్ల ఎత్తున ఈ గోడల నిర్మాణం చేస్తున్నారు. దీంతోపాటు పక్కన 33ఫీట్ల రోడ్డు, డ్రెయినేజీ కూడా నిర్మాణం జరగాల్సి ఉంది. ప్రస్తుతం నిర్మిస్తున్న వరద నివారణ గోడలు కేవలం ప్రకాష్‌నగర్ వరకే కట్టడం వల్ల మున్నేరు నుంచి ధంసలాపురంవైపు కాలనీల్లోకి, నగరంలోకి వరద పెరిగే పరిస్థితి ఉంది. దీంతో ప్రకాష్‌నగరనుంచి ధంసలాపురం వరకు గోడలను నిర్మించేందుకు సర్వే చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ఇరువైపులా మరో 4కి.మీ.పొడవున సర్వే జరుగుతుంది. ఇందుకు సుమారు రూ.400కోట్లనిధులు అవసరం ఉంది. ధంసలాపురం దిగువ వైపున కూడా గోడలు నిర్మిస్తేనే మున్నేరు నుంచి ఖమ్మం నగరానికి వరదనుంచి రక్షణ కలగనుంది ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మున్నేరు వరద బాధితులు కోరుతున్నారు. ఖమ్మంనగరంతో పాటు రూరల్ మండలంలో కూడా పోలేపల్లి నుంచి గుదిమళ్లవైపుగా కరకట్టలు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం నిర్మించేది ప్రకాష్‌నగర్ వరకు కావడంతో మున్నేరుకు వరద వచ్చినా ప్రకాష్‌నగర్‌నుంచి ధంసలాపురం వైపు వరద బీభత్సం సృష్టించే అవకాశంఉంది. మున్నేరుకు ఇరువైపులా శాశ్వతంగా వరద భయం లేకుండా ఉండాలంటే ధంసలాపురం వరకు వరద నివారణ గోడలు నిర్మించాల్సి ఉంది. అలాగే గోడలు పూర్తిగా బఫర్‌జోన్‌లో కాకుండా కొద్దిగా వెడల్పుగా గోడలు నిర్మిస్తే వరదకు ఆటంకం రావొద్దని వరద బాధితులు కూడా సూచిస్తున్నారు. మొత్తమ్మీద ప్రభుత్వం త్వరగా మున్నేరు వరద గోడల నిర్మాణంపై దృష్టిపెట్టాల్సి ఉంది.

శాంతించిన మున్నేరు

(5వ పేజీ తరువాయి)

అదనంగా పారిశుధ్య సిబ్బందిని రప్పించారు. 9 నీటి ట్యాంకర్లతో నివాసాలు, రహదారులపై ఉన్న వరద బురదను తొలగించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నీటి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయించారు. వరద ముంపుతో నివాసాలకు బురద పట్టిన కుటుంబాలకు అదనంగా నీటి నిల్వలను ఇచ్చారు. రహదారులు, డ్రైయినేజీలు, శుభ్రమైన తర్వాత బ్లీచింగ్, సున్నం చల్లించారు. పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మల్లయ్య, పీ వెంకటేశ్వర్లు, జవాన్లు రమేశ్, చిరంజీవి, బంగారి గత మూడు రోజులుగా పారిశుధ్య పనులు చేపట్టారు.శుక్రవారం సాయంత్రం వరకు చాలా ప్రాంతాలు, వీధులు సాధారణ పరిస్థితుల్లోకి వచ్చాయి.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మేయర్

మున్నేరు ముంపు ప్రాంతాల్లో మేయర్ పునుకొల్లు నీరజ ఉదయం 6గంటల నుంచే విస్తృతంగా పర్యటించారు.పునరావాస కేంద్రాల నుంచి తమ నివాసాలకు చేరుకున్న వారి ఇళ్లకు వెళ్లి పద్మావతినగర్‌లో అల్పాహారం పంపిణీ చేశారు. బొక్కలగడ్డ, కాల్వొడ్డు, సుందరయ్యనగర్, మోతినగర్, వెంకటేశ్వరనగర్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వరద బురద వెళ్లేందుకు అధికారులకు సైతం సూచనలు చేశారు. పలు నివాసాల్లోకి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మున్నేరు ముంపు ప్రాంతాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పరిసరాలు సాధారణ స్థాయిలోకి వచ్చే వరకు కేఎంసీ నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపిణీ చేస్తామన్నారు. తాగునీటి ట్యాంకుల్లోకి వరద నీరు చేరడంతో.. వాటిని పరిశుభ్రం చేసేందుకు కొంత సమయం పడుతుందని, కుళాయిల ద్వారా వచ్చే నీటిని ఇప్పుడే వాడుకోవద్దని సూచించారు. అవసరమైన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని వేళల్లో అధికారులు అందుబాటులో ఉంటారని భరోసా కల్పించారు. కొన్ని నివాసాలకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులతో మేయర్ మాట్లాడి విద్యుత్ సరఫరా పనులు ప్రారంభం జరిగేలా చేశారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారికి తెల్లారుతుండగానే వరద ప్రబావం తగ్గిందని తెలుసుకొని వెంటనే వారి నివాసాలకు వెళ్లి ఇంటి పరిశుభ్రం పనులు చేసుకున్నారు. దీంతో మేయర్ ముంపు ప్రబావిత వీధుల్లోకి అల్పాహారం పంపించి స్వయంగా పంపిణీ చేశారు. తమ ఇంటి ముందుకే వచ్చి అల్పాహారం ఇవ్వడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, నాయకులు కన్నం ప్రసన్న, నాళం సతీష్‌లు కూడా స్థానికులకు సహాయం అందించారు.

కార్మిక సంఘాల్లో ఏఐటీయూసీది పెద్దన్న పాత్ర

- కార్పొరేటర్ బీజీ క్లెమేట్
- ఘనంగా 106వ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న కార్పొరేటర్ క్లెమేట్

ఖమ్మంసంక్షేమ విభాగం,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాల్లో ఏఐటీయూసీది పెద్దన్న పాత్ర సంఘం రాష్ట్రనాయకులు, కార్పొరేటర్ బీజీ క్లెమేట్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఏఐటీయూసీ స్థూపం వద్ద సంఘం 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1923లో మద్రాస్‌లో సింగరవెల్లి శెట్టియార్ తొలి జెండావిష్కరణ చేశారని తర్వాత కార్మికుల సమస్యలపై నిర్విరామంగా పనిచేసిందన్నారు. 1926లో ఇండియన్ ట్రేడ్ యూనియన్ యాక్టును తీసుకరావటంతో ఏఐటీయూసీ చేసిన పోరాటాల ఫలితమే అన్నారు. ఇటీవల బీజేపీ ప్రభుత్వంలోని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్పులు చేశారని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాల్గు లేబర్ కోడ్‌లను అమలు చేశారని ఆరోపించారు. కార్మికవర్గం ఉన్నంత కాలం ఏఐటీయూసీ జెండాలు ఎగురుతూనే ఉంటాయన్నారు. నాయకులు తాటి వెంకటేశ్వరరావు, గాదే లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు,పేరబోయిన మోహన్‌రావు, పిట్టల మల్లయ్య, ఎండీ జాకీరుద్దీన్, సీతామహాలక్ష్మీ, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లలో కనీస సౌకర్యాలు కరువు

- అధ్వానంగా రహదారి.. రాత్రివేళల్లో అవస్థలు
- మోటమర్రి రైల్వే స్టేషన్లో నత్తనడకన పనులు
- ఎక్స్‌ప్రెస్ రైళ్ల హోల్టింగ్‌కు.. ప్రజల ఎదురు చూపులు



అధ్వానంగా ఉన్న బోనకల్ రైల్వే స్టేషన్ రహదారి

బోనకల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోటమర్రి, బోనకల్ రైల్వే స్టేషన్లలో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ రెండు స్టేషన్లు ఆంధ్రా సరిహద్దు ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో రెండు రాష్ట్రాల ప్రజలు రైలు మార్గాన రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే ఆధునీకరణ కింద ప్లాట్‌ఫాంల అభివృద్ధి, అదనపు ట్రాక్‌ల ఏర్పాటు, సౌకర్యాల కల్పన చేపట్టారు. కాని పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆధునీకరణ పనులు మున్నాల ముచ్చటగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ఇబ్బందులతోనే జర్నీని సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



రైల్వే స్టేషన్లో ప్రధాన సమస్యలు ఇవే..

బోనకల్ రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపై నీడ కోసం పూర్తిస్థాయిలో షెడ్లు లేవు. దీంతో ప్రయాణీకులు ఎండ, వానలోనే వేచి ఉండాల్సి వస్తోంది. సిట్టింగ్ సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తాగునీటి, మూత్రశాలల సౌకర్యాలు లేవు

అదనపు ట్రాక్ ఏర్పాటు వల్ల ప్లాట్‌ఫాంల విస్తరణ పెరిగినందున రైళ్ల రాకపోకలను బట్టి రెండవ ప్లాట్‌ఫాంపై కూడా టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వాహన పార్కింగ్ లేదు. మరో ఫుట్‌బోర్డు వంతెన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బోనకల్‌తోపాటు పలు గ్రామాల నుంచి రైల్వే స్టేషన్‌కు చేరుకునే రెండవ ప్లాట్‌ఫాం వైపు రోడ్డు మార్గం అధ్వాన్నంగా ఉంది. రాత్రివేళల్లో మహిళలు, వృద్ధులు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఈ మార్గానికి రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



నత్త నడకన సాగుతున్న మెట్ల నిర్మాణ పనులు

మండల కేంద్రమైన బోనకల్ రైల్వే స్టేషన్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని శాతవాహన, ఇంటర్ సిటీ, లింక్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని మండల ప్రజలు పలుసార్లు రైల్వే డీఆర్‌ఎం, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. కాని ఫలితం లేక పోవడంతో ప్రయాణికులకు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హోల్టింగ్ తీరని కలగా మిగిలింది.

మోటమర్రి రైల్వే జంక్షన్‌గా మారినా సమస్యల పరిష్కారం మాత్రం జరగడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్టేషన్లో నుంచి బయటకు వచ్చే మెట్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రైలు దిగిన వారు ట్రాక్‌లు దాటి స్టేషన్ బయటకు వెళ్లాల్సి రావడంతో రాత్రివేళల్లో ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. మెట్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని కోరుతున్నారు.

సిట్టింగ్, షెడ్ల ఏర్పాటు సౌకర్యం సక్రమంగా లేదు. తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఫ్లాట్‌ఫాంల నెంబర్లు లేక పోవడంతో పాటు ట్రాక్‌ల పై గూడ్సు రైళ్లు ఉండటంతో టిక్కెట్లు తీసుకున్న ప్రయాణికులు వాటి కింద దూరి వెళ్తున్నారు. ఎక్కువ మంది యాతన పడ లేక ప్రత్యేక వాహనాలు మాట్లాడుకొని దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. తమ సమస్యల పరిష్కారం ఎన్నటికి జరుగుతుందోనని ప్రయాణీకులు ఎదురు చూస్తున్నారు.



సమస్యలతో సతమతమవుతున్న మోటమర్రి రైల్వే స్టేషన్

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

- జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్



సత్తుపల్లి పట్టణంలో రన్ ఫర్ యూనిటీలో న్యాయాధికారి, ఏసీపీలు

సత్తుపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్ధార్ వల్లభాయ్ పటేల్ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ఆయన అడుగుజాడలలో నడవాలని జిల్లా న్యాయాధికారిమారగాని శ్రీనివాస్ కోరారు. భారత ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత తొలి హోంమంత్రి పటేల్ 150వ జయంతి సందర్భంగా సత్తుపల్లిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు.



2కే రన్‌లో వైరా, మధిర పోలీసు అధికారులు, సిబ్బంది

వైరా: వైరా పోలీస్ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం వైరాలో జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా 2కె రన్ నిర్వహించారు. సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, రాజకీయ నాయకులు 2కె రన్‌లో పాల్గొన్నారు. భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ సమైక్యత కోసం పోరాడిన గొప్ప నేత అని ఆయన జయంతి సందర్భంగా జాతీయ సమైక్యత దినోత్సవం జరుపుకోవడం శుభపరిణామం అని మధిర టౌన్ సీఐ దోమల రమేష్, వైరా ఎస్‌ఐ పుష్పాల రామారావు పేర్కొన్నారు.



గంగారం బెటాలియన్‌లో మాట్లాడుతున్న అంజయ్య

సత్తుపల్లిరూరల్: ఉక్కు మనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో అందరూ ఐకమత్యంతో ముందుకెళ్లాలని 15వ బెటాలియన్ అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య పిలుపునిచ్చారు. సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివాస్ వేడుకలను శుక్రవారం మండలంలోని గంగారం బెటాలియన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన జీవితచరిత్రను, కఠోర దీక్షను, దేశ సమగ్రతకు, జాతి ఐక్యతకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్ఎస్.శ్రీధర్‌రాజా, ఎస్‌డీ.రంగారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్

కల్లూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో గల హనుమాతండా గ్రామంలో శుక్రవారం పీఏసీఎస్ తరుపున ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీరజదేవి మాట్లాడుతూ.. రైతులు మద్ధతు ధరను పొందేందుకు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించాలని కోరారు. దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, నాయకులు తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్, భూక్యా శివకుమార్‌నాయక్, రైతులు బానోతు లాల్‌సింగ్, పుల్లాచారి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్య' వైరా ఇన్‌చార్జ్‌గా శేషగిరిరావు

వైరా, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆత్మకూరి శేషగిరిరావును తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత నియమించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సహకారంతో శేషగిరిరావును నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించారు. నియోజకవర్గంలో ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషిచేస్తానని శేషగిరిరావు తెలిపారు. తనను నియమించిన సుజాత, సహకరించిన ఎమ్మెల్యే రాందాస్, జిల్లా ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

హరీష్‌రావుకు సండ్ర పరామర్శ



సత్తుపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, సిద్దిపేట శాసన సభ్యుడు తన్నీరు హరీష్‌రావును మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. ఇటీవల హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ మరణించిన విషయం విధితమే. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి హైదరాబాద్ కోకాపేటలోని హరీష్‌రావు నివాసానికి వెళ్లి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శాంతించిన మున్నేరు

(5వ పేజీ తరువాయి)

అదనంగా పారిశుధ్య సిబ్బందిని రప్పించారు. 9 నీటి ట్యాంకర్లతో నివాసాలు, రహదారులపై ఉన్న వరద బురదను తొలగించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నీటి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయించారు. వరద ముంపుతో నివాసాలకు బురద పట్టిన కుటుంబాలకు అదనంగా నీటి నిల్వలను ఇచ్చారు. రహదారులు, డ్రైయినేజీలు, శుభ్రమైన తర్వాత బ్లీచింగ్, సున్నం చల్లించారు. పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మల్లయ్య, వీ వెంకటేశ్వర్లు, జవాన్లు రమేశ్, చిరంజీవి, బంగారి గత మూడు రోజులుగా పారిశుధ్య పనులు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం వరకు చాలా ప్రాంతాలు, వీధులు సాధారణ పరిస్థితుల్లోకి వచ్చాయి.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మేయర్

మున్నేరు ముంపు ప్రాంతాల్లో మేయర్ పునుకొల్లు నీరజ ఉదయం 6గంటల నుంచే విస్తృతంగా పర్యటించారు. పునరావాస కేంద్రాల నుంచి తమ నివాసాలకు చేరుకున్న వారి ఇళ్లకు వెళ్లి పద్మావతినగర్‌లో అల్పాహారం పంపిణీ చేశారు. బొక్కలగడ్డ, కాల్వొడ్డు, సుందరయ్యనగర్, మోతీనగర్, వెంకటేశ్వరనగర్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వరద బురద వెళ్లేందుకు అధికారులకు సైతం సూచనలు చేశారు. పలు నివాసాల్లోకి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ.. మున్నేరు ముంపు ప్రాంతాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పరిసరాలు సాధారణ స్థాయిలోకి వచ్చే వరకు కేఎంసీ నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపిణీ చేస్తామన్నారు. తాగునీటి ట్యాంకుల్లోకి వరద నీరు చేరడంతో.. వాటిని పరిశుభ్రం చేసేందుకు కొంత సమయం పడుతుందని, కుళాయిల ద్వారా వచ్చే నీటిని ఇప్పుడే వాడుకోవద్దని సూచించారు. అవసరమైన వైద్య శిబిరాలు ఏర్పటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని వేళల్లో అధికారులు అందుబాటులో ఉంటారని భరోసా కల్పించారు. కొన్ని నివాసాలకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులతో మేయర్ మాట్లాడి విద్యుత్ సరఫరా పనులు ప్రారంభం జరిగేలా చేశారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారికి తెల్లారుతుండగానే వరద ప్రభావం తగ్గిందని తెలుసుకొని వెంటనే వారి నివాసాలకు వెళ్లి ఇంటి పరిశుభ్రం పనులు చేసుకున్నారు. దీంతో మేయర్ ముంపు ప్రభావిత వీధుల్లోకి అల్పాహారం పంపించి స్వయంగా పంపిణీ చేశారు. తమ ఇంటి ముందుకే వచ్చి అల్పాహారం ఇవ్వడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కన్నం వైష్ణవి, నాయకులు కన్నం ప్రసన్న, నాళం సతీష్‌లు కూడా సహాయం అందించారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళులు

దేశ మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తల్లాడలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో దేశం కోసం ప్రాణాలర్పించిన ఉక్కు మహిళ మాజీప్రధాని ఇందిరాగాంధీ అని వైరా మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కాపా సుధాకర్ కొనియాడారు. పలు ప్రాంతాల్లో జరిగిన ఆమె వర్ధంతి కార్యక్రమాల్లో నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని పూలమాలలతో నివాళులర్పించారు.



వైరాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మధిరలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



తల్లాడలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గోడలే.. ఖమ్మానికి 'రక్ష'ణ!

(5వ పేజీ తరువాయి)

నిర్మిస్తున్నారు. ఇందుకు రూ.690కోట్లవరకు నిధులు ఖర్చు కానున్నాయి. ఖమ్మంలోని దానావాయిగూడెం నుంచి ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వరకు ప్రస్తుతం ఈరక్షణ గోడలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 30శాతం పనులు పూర్తికాగా.. ఇంకా 70శాతం పనులు చేట్టాల్సి ఉంది. మొత్తం 239 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉండగా 140 ఎకరాల ప్రైవేటు భూమి ఉంది. ప్రైవేటు భూయజమానులకు ప్రత్యామ్నాయం కింద ల్యాండ్ పూలింగ్ విధానం అమలు చేయాలంటే కేబినేట్ ఆమోదం కావాలి. దీంతో భూసేకరణ జరగకపోవడంతో రక్షణ గోడల నిర్మాణం జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ భూముల్లోనే వరద కట్టలపనులు జరుగుతున్నాయి. 6మీటర్లను 11మీటర్ల ఎత్తున ఈ గోడల నిర్మాణం చేస్తున్నారు. దీంతోపాటు పక్కన 33ఫీట్ల రోడ్డు, డ్రెయినేజీ కూడా నిర్మాణం జరగాల్సి ఉంది. ప్రస్తుతం నిర్మిస్తున్న వరద నివారణ గోడలు కేవలం ప్రకాష్‌నగర్ వరకే కట్టడం వల్ల మున్నేరు నుంచి ధంసలాపురంవైపు కాలనీల్లోకి, నగరంలోకి వరద పెరిగే పరిస్థితి ఉంది. దీంతో ప్రకాష్‌నగరనుంచి ధంసలాపురం వరకు గోడలను నిర్మించేందుకు సర్వే చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ఇరువైపులా మరో 4కి.మీ.పొడవున సర్వే జరుగుతుంది. ఇందుకు సుమారు రూ.400కోట్లనిధులు అవసరం ఉంది. ధంసలాపురం దిగువ వైపున కూడా గోడలు నిర్మిస్తేనే మున్నేరు నుంచి ఖమ్మం నగరానికి వరదనుంచి రక్షణ కలగనుంది ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మున్నేరు వరద బాధితులు కోరుతున్నారు. ఖమ్మంనగరంతో పాటు రూరల్ మండలంలో కూడా పోలేపల్లి నుంచి గుదిమళ్లవైపుగా కరకట్టలు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం నిర్మించేది ప్రకాష్‌నగర్ వరకు కావడంతో మున్నేరుకు వరద వచ్చినా ప్రకాష్‌నగర్‌నుంచి ధంసలాపురం వైపు వరద బీభత్సం సృష్టించే అవకాశంఉంది. మున్నేరుకు ఇరువైపులా శాశ్వతంగా వరద భయం లేకుండా ఉండాలంటే ధంసలాపురం వరకు వరద నివారణ గోడలు నిర్మించాల్సి ఉంది. అలాగే గోడలు పూర్తిగా బఫర్‌జోన్‌లో కాకుండా కొద్దిగా వెడల్పుగా గోడలు నిర్మిస్తే వరదకు ఆటంకం రావొద్దని వరద బాధితులు కూడా సూచిస్తున్నారు. మొత్తమ్మీద ప్రభుత్వం త్వరగా మున్నేరు వరద గోడల నిర్మాణంపై దృష్టిపెట్టాల్సి ఉంది.

పీడీఎస్‌యూ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

తల్లాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా మహాసభ నవంబరు 4వ తేదీన సత్తుపల్లి పట్టణంలో జరుగుతుందని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి గాజుల శశికిరణ్ అన్నారు. శుక్రవారం తల్లాడలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సామాజిక, స్వతంత్ర, విప్లవోద్యమాలకు పురిటిగడ్డ అయిన సత్తుపల్లిలో జరిగే మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు రాజీవ్, రియాజ్, రాంచరణ్‌పాల్గొన్నారు.

ఇకపై లబ్ధిదారులకు 365రోజులూ ఇసుక

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



శాండ్‌బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రతి మెట్రిక్ టన్నుకు రూ.1100, ఇతరులకు రూ.1300చొప్పున 365రోజులూ ఇసుక అందుబాటులో ఉంటుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. టీజీఎండీసీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన శాండ్‌బజార్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఇసుకబజార్ ద్వారా ప్రజలకు నాణ్యమైన ఇసుకను తక్కువ ధరలో అందిస్తున్నామని, దీంతో ఇసుక అక్రమ రవాణా అరికట్టడమే కాకుండా నిర్మాణ రంగంలో ఇసుక కొరతను తీర్చేందుకు సహాయపడుతుందన్నారు. ప్రజలు ఇసుకను నేరుగా గానీ, ఆన్‌లైన్ ద్వారా గానీ బుక్ చేసుకుని పొందే అవకాశం ఉండగా, ఇతరత్రా సందేహాల కోసం టీజీఎండీసీ హెల్ప్‌లైన్ నంబర్ 155242ను సంప్రదించవచ్చన్నారు. అంతకముందు ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మునిసిపల్ ఆఫీస్ ఎదురుగా ఆమె విగ్రహం వద్ద పూలుజల్లి నివాళి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీజీఎండీసీ పీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ సత్యనారాయణ, మునిసిపల్ కమిషనర్ కే.నర్సింహ, ఎంపీడీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

ముదిగొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని సీఐ మురళీ అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ పోలీస్ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముదిగొండ మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని సీఐ మురళీ అభినందించారు. మండల వ్యాప్తంగా అందరూ పాల్గొనటం పట్ల సీఐ కృతజ్ఞతలు తెలిపారు. మండలం నుంచి రక్తదానం చేసేందుకు అధిక సంఖ్యలో పాల్గొన్నందుకు, చొరవ తీసుకున్న సీఐ మురళీని సీపీ సునీల్‌దత్ అభినందించారు. ఏసీపీ తిరుపతి రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

అండర్-17 బాలబాలికల కబడ్డీ ఎంపికలు

పెనుబల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అండర్-17 బాలబాలికల కబడ్డీ జిల్లాస్థాయి పోటీలకు శుక్రవారం వీఎంబంజర్‌లోని పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపికలు జరిగాయి. ఈ పోటీలకు 67మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరిలో 32మంది బాలికలు, 35మంది బాలురు ఎంపికైనట్లు పీడీ బండి రాము తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీవీ.రామారావు, అన్ని పాఠశాలల యజమాన్యాలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు మధిరలోని శ్రీనిధి విద్యార్థులు

మధిర: ఇటీవల జరిగిన మండల స్థాయి కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బట్టా అంజనబాబు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ఉదయశ్రీ, బాలపోర్టిక, మౌనిక, నవ్వరెడ్డి బాలికల విభాగంలో, నాగ అఖిల్, అహ్మద్ బాలుర విభాగంలో మొత్తం ఆరుగురు విద్యార్థులు అండర్17 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. నవంబర్ 2 నుంచి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పీఈటీలు ప్రవీణ్ కుమార్, శివ, కరిష్మా అభినందించారు.

క్రీడాసామగ్రి పంపిణీ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని శ్రీ బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్రీడాసామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ గుడిపూడి లక్ష్మయ్య మాట్లాడుతూ చదువుతో పాటు ఆటపాటలు నేర్చుకోవాలన్నారు. ఇంటర్మీడియేట్ విద్యామండలి రూ.10వేల విలువైన ఆటవస్తువులను సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాసామగ్రితో విద్యార్థులు

కల్లూరు సీహెచ్‌సీలో అరుదైన శస్త్ర చికిత్స



మహిళకు చికిత్సతో కణితిని తొలిగించి వైద్య బృందం

కల్లూరు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో(సీహెచ్‌సీ) శుక్రవారం ఓ పేద మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాన్ని కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. తల్లాడ మండలంలోని రంగం బంజర గ్రామానికి చెందిన సంఘసాని జానకమ్మ పోయిన సంత్సరం నుంచి కడుపు నొప్పి, గ్యాస్ ట్రబుల్‌తో బాధపడుతోంది. ఇటీవల కాలంలో జానకమ్మ, శేషయ్య దంపతులు వైద్యం కోసం పలు ఆసుపత్రులు తిరిగిన కడపు నొప్పి తగ్గక పోవడంతో కొద్ది రోజుల క్రితం కల్లూరులోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో వైద్యుడు రమేష్‌ను ఆ మహిళ కుటుంబ సభ్యులు సంప్రదించారు. సదరు మహిళను వైద్యుడు రమేష్ సూచనతో స్కానింగ్ పరీక్ష చేయగా కడుపులో ఐదు కేజీల కణితి ఉన్నట్లు నిర్ధారణ అయింది. శుక్రవారం ఉదయం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారి రాజశేఖర్ పర్యవేక్షణలో స్థానిక వైద్యుడు రమేష్, ఎనస్తీషియా వైద్యుడు అశోక్, సిబ్బందిలు శస్త్ర చికిత్స చేసి జానకమ్మ కడుపులో గల కణితిని తొలిగించారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్స చేసి పేద మహిళ ప్రాణాన్ని కాపాడిన వైద్య బృందాన్ని ఆమె కుటుంబ సభ్యులు అభినందించారు.

రైతులను ఆదుకోవాలి

- వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

కారేపల్లి అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి)చేతి కొచ్చిన పంట కళ్ళదుటే నీటిపాలవ్వడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రవతి శుక్రవారం అన్నారు.

సర్టిఫికెట్ పోయినది

నేను అనగా ముక్తి పెద్దవెంకటరమణ W/o లక్ష్మి నారాయణ, గ్రామం, రాయమాధారం, ఏన్కూరు మండలం, ఖమ్మం జిల్లా ది. 30-10-2025 నాడు ఏన్కూరు బస్ షెల్టర్‌లో బస్సు ఎక్కే సమయంలో నాయొక్క ఒరిజినల్ SSC Memo పడిపోయినవి ఎంత వెతికిన దొరకలేదు, దొరికినవారు పై అడ్రస్‌కు అందజేయగలరు

ముక్తి పెద్ద వెంకటరమణ : 9492276725